ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
16
గురువారం 24 ఆగస్టు 2017




నల్లబెల్లం.. సారా.. గంజాయి..

- ఈ కోణంలోనే పోలీస్, ఎక్సైజ్ వెతుకులాట
- మత్తు పదార్థాల దిశగా జరగని తనిఖీలు
- టాస్క్‌ఫోర్స్ చూసుకుంటుందని వితండవాదం
- ఆసుపత్రుల్లో పెరుగుతున్న 'డ్రగ్స్' బాధితులు
- మానసిక వైద్యుల కౌన్సెలింగ్‌ల్లో దిగ్భ్రాంతికర వాస్తవాలు

అయితే సారా.. లేకుంటే నల్లబెల్లం.. అది కాకుంటే గంజాయి.. ఈ దిశగానే ఎక్సైజ్, పోలీస్ అధికారుల తనిఖీలు సాగుతున్నాయి. అంతేకానీ ఇంకా లోతులకు వెళ్లడం లేదు. పారిశ్రామిక ప్రాంతంగా వెలుగొందుతున్న జిల్లా మాదకద్రవ్యాల వినియోగం కూడా ఎక్కువే. ఇటీవల హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసు సంచలనం సృష్టించిన నేపథ్యంలో జిల్లాలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. కానీ అవి గంజాయి, నల్లబెల్లం, సారాను దాటి పోవడం లేదు.

11

- ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం/కొత్తగూడెం క్రైం



మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుదాం

- ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మిద్దాం
- అధికారులకు కలెక్టర్ పిలుపు




ప్రసంగిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

3

పునరా 'మోసం'!

- క్వింటాళ్ల కొద్దీ సరుకులు కొనుగోలు చేసిన ఎక్సైజ్ అధికారులు
- అవసరం లేని వాటిని అంటగట్టిన వైనం
- ప్రశ్నించిన లబ్ధిదారులపై తిట్లపురాణం
- ఎలా అమ్మాలో తెలియడం లేదని గిరిజనుల ఆవేదన



11

లబ్ధిదారులకు ఇచ్చినట్టు కాగితంపై సరుకుల వివరాలు నమోదు చేసిన అధికారులు

వికటించిన పాలు

- బీసీ బాలికల గురుకులంలో 21 మంది విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత
- ఆసుపత్రికి తరలింపు
- సిబ్బందిపై ట్రైకార్ చైర్మన్ తాటి ఆగ్రహం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

6



మృతి చెందిన శిరీష

అమ్మా.. అనిపించుకునేలోపే..

- ప్రసవ వేదనతో తల్లి.. గర్భంలోనే చిన్నారి మృతి
- వెక్కిరించిన పేదరికం.. అశ్వారావుపేటలో విషాదం

6

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'కోల్' నాగుల్లో కలకలం!

- సంచలనం సృష్టించిన 'ఆంధ్రజ్యోతి' కథనం
- తవ్వినకొద్దీ వెలుగులోకి వస్తున్న మాఫియా ఆగడాలు
- నాలుగు శాతం మామూళ్లు ఇచ్చుకోలేక లారీలనే అమ్మేసిన యజమానులు
- దందాను అరికట్టాలని విజ్ఞప్తి

11



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని చదువుతున్న లారీ యజమానులు



9

నేడు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో..

ఖమ్మంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

ఆదాయపు పన్ను గణనలో మినహాయింపులు

బోనకల్: ఉద్యోగులకు సంబంధించిన ఆదాయపు పన్నులో మినహాయింపుల గణనను గురించి ప్రధాన సమాచారాన్ని మీకోసం అందజేస్తున్నాం... ఇంటిని రుణంతో నిర్మించి సొంతంగా ఉంటున్న వారికి రుణంపై చెల్లిస్తున్న వడ్డీపై రూ.రెండు లక్షల వరకు మినహాయింపు ఉంది. ఒకవేళ ఇంటిని భార్య, భర్త ఇద్దరూ జాయింట్‌గా రుణం పొంది నిర్మిస్తే ఇద్ధరికి సమానంగా విభజించి ఒక్కొక్కరు గరిష్ఠంగా రెండు లక్షల మినహాయింపు పొందవచ్చు. ఇంటి రుణం తీసుకొని ఇంట్లో స్వయంగా నివసించకుండా అద్దెకు ఇచ్చినట్లయితే ఇంటిరుణంపై వడ్డీ పూర్తిగా మినహాయింపు ఉంటుంది. కానీ వచ్చే అద్దెను ఆదాయంగా చూపాలి. సెల్ఫ్,స్పౌజ్, పిల్లల ఉన్నత



చదువుల పిల్లల కోసం విద్యారుణంపై చెల్లించిన వడ్డీ మినహాయింపు ఉంటుంది. ఈ మినహాయింపు గరిష్ఠంగా ఏడు సంవత్సరాలు వర్తిస్తుంది.

గణనాథున్ని ఏసమయంలోపు పూజించాలంటే..

ఖమ్మం సాంస్కృతికం: ఈసారి వినాయక చవితి రోజు(ఆగస్టు 25న).. చవితి రాత్రి 9.20 వరకు ఉన్నది. కాబట్టి ఇంట్లో పూజ చేసుకునేరు మధ్యాహ్నం 12గంటలలోపు పూజించాలి. వీధుల్లో మంటపాన్ని పెట్టి ఆవాహన చేసేవాళ్లు సాయంత్రం లోపు పూజ చేయాలి.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్సర్వ విఘ్నోప శాంతయే

మన పడుగలు మన భారతీయ సంస్కృతికి అద్దం పడుతూ.. అవి ఆణిముత్యాలతో కూడిన ముత్యాల హారంలా ప్రకాశిస్తూ, మన సంస్కృతిని ప్రతిబింబింప చేస్తుంటాయి. అటువంటి పండుగలలో విశిష్టమైనది వినాయకచవితి. తొలుత ఏ పని ప్రారంభించాలన్నా గణపతి పూజతో ప్రారంభిస్తాం. పిన్నల నుంచి పెద్దల వరకూ ఎంతో భక్తి శ్రద్ధలతో ఎంతో వేడుకగా చేసుకునేది ఈ చవితి పండుగ. భాద్రపద శుద్ధ చవితి రోజున విశేషంగా గణపతి పుట్టిన రోజు అయిన ఈ రోజున పండుగ జరుపుకొంటాం. మహేశ్వరాది దేవతా గణాలందరికీ గణపతి ప్రభువు. అంటే హిందువుల సకలదేవతా గణాలకు ఆయనే ప్రభువన్న మాట. బ్రహ్మ తొలుత ఈ సృష్టి కార్యాన్ని ప్రారంభించేముందు గణపతిని పూజించినట్లు రుగ్వేదం చెబుతోంది. బ్రహ్మావైవర్తన పురాణం లో 'గణ' శబ్దానికి విజ్ఞానమని, 'ణ' అంటే తేజస్సు అని పేర్కొన్నారు.



అధ్యాపకుడిని కావాలనుకున్నా..
టైపిస్టుగా చేరా

టి. రాజేంద్రం,
దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఖమ్మం



ఇంటర్వ్యూ Interview

\- ఖమ్మం సాంస్కృతికం

సమాజసేవ చేసి ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే కాంక్ష. వచ్చిన రెండు అవకాశాలను వదులుకుని కుటుంబ పోషణకై ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ ద్వారా టైపిస్టుగా వృత్తిలో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ దేవాదాయ, ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తమ్మా రాజేంద్రం ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

కుటుంబ నేపథ్యం..

మాది వ్యవసాయ కుటుంబం. వరంగల్ జిల్లా పరకరాల మండలం ధర్మారం గ్రామం. తల్లిదండ్రులు తమ్మా కనకయ్య, నర్సమ్మ. నాన్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేశారు. ఇద్దరం అన్నదమ్ములం, పెద్దవాడిని నేను ఎమ్మెస్సీ బీఈడీ పూర్తిచేశాను. మా తమ్ముడు మునిసిపల్ శాఖలో చిరుద్యోగిగా పనిచేస్తున్నారు. ఐదో తరగతి వరకు మూడు కి.మీ చదువు కోసం నడిచివెళ్లాం.

చదువు సాగిందిలా...

ఐదో తరగతి వరకు నడికూడి గ్రామంలో ఆరు నుంచి పరకాలలో ప్రభుత్వ హాస్టల్‌లో, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బీఎస్సీని వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పూర్తిచేశాను. బీఎడ్, ఎంఎస్‌సీని వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో చేశారు.

ఉద్యోగ నేపథ్యం :

డిగ్రీలోనే స్కూల్ అసిస్టెంట్‌గా సెలక్ట్ అయ్యాను. తర్వాత ఫిషరీష్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టు వచ్చింది. 1987లో టైపిస్ట్‌గా వరంగల్‌లోని దేవాదాయశాఖ కార్యాలయంలో ఉద్యోగంలో చేరాను. తర్వాత సీనియర్ అసిస్టెంట్ ఖమ్మం జిల్లా కొత్తగూడెం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఈవోగా 2010లో మేడారం ఆలయానికి, వరంగల్ భద్రకాళి ఆలయాల్లో పనిచేశా. ఉద్యోగోన్నతిపై వరంగల్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేశాను.

సాధించిన అవార్డులు

నాలుగుసార్లు ఉత్తమ ప్రశంసలను అందుకున్నా. 2017 ఆగస్టు 15న జిల్లాలో హరితహారానికి అవార్డు సాధించా. మంచి అధ్యాపకుడిని కాలేకపోయానన్న బాధ కలిగినా మేడారం జాతరలో కోటి మందికి సేవల్ని అందించడం సంతృప్తిని ఇచ్చింది.

అమ్మలా అక్కున చేర్చుకుంటున్న

అంగన్‌వాడీ ఆయమ్మ



కష్టపడితే తగిన ప్రతిఫలం ఉంటుందని, చేసే పనిని బాధ్యతగా చేస్తే గుర్తింపు అనేది దానంతట అదే వస్తుందని నిరూపించారు కొద్దిపాటి పారితోషకం తీసుకునే ఓమహిళ. ఎవరున్నా లేకపోయినా తన పనిని తాను చేసుకుంటూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు అంగన్‌వాడీ కేంద్రంలో విధులు ఆయా కె.పాపమ్మ. 26ఏళ్లుగా కొద్దిపా టి పారితోషకాన్ని తీసుకుంటూ చిన్నారుల, గర్భిణుల సేవలో తరిస్తున్నారు. కేంద్రా న్ని చక్కగా పచ్చని వాతావరణంలో ఉంచిన ఈమెను ఇటీవల జిల్లాస్థాయిలో ఉత్తమ ఆయాగా అవార్డు వరించింది. కేంద్రానికి వచ్చే ఎవరికైనా పరిశుభ్ర వాతావరణం, పచ్చని చెట్లు స్వాగతం పలికేలా చేసిన పాపమ్మపై ప్రత్యేక కథనం..

-అశ్వారావుపేట రూరల్

గిరిజన మహిళకు శ్రమకు తగిన ఫలితం
ఉత్తమ ఆయాగా అవార్డు అందుకున్న పాపమ్మ
పిల్లలను కేంద్రానికి తీసుకురావటంలో శ్రద్ధ
తోటను పెంచటంలో ఎంతో ప్రత్యేకత



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని అనంతారం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా అదే గ్రామానికి చెందిన కె.పాపమ్మ ఆయాగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లో ఆమెకు కేవలం నెలకు రూ.వంద మాత్రమే వేతనంగా ఇచ్చేవారు. అయినా ఆనాటి నుంచి కేంద్రంలో బాధ్యతగా పనిచేస్తూ వచ్చారు. కేంద్రం ప్రారంభమయ్యే సమయానికే ఇంటింటికి తిరిగి పిల్లలను తీసుకురావటం, గర్భిణులు, బాలితలు కేంద్రం ద్వారా అమలయ్యే పథకాలను సక్రమంగా వినియోగించుకునేలా చూడటంలో పాపమ్మ దిట్ట. దీంతో పాటు కేంద్రంలో రకరకాల పూల, కూరగాయల మొక్కలను ప్రత్యేక శ్రద్ధతో పెంచుతున్నారు. వీటికి నిత్యం నీళ్లుపోయటం, కలుపు తీయటం పాపమ్మ పనిగా పెట్టుకుంటారు. కొద్దిరోజుల క్రితం కేంద్రానికి వచ్చిన ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి కేంద్ర ఆవరణను చూసి ఆయాను ఎంతగానో మెచ్చుకున్నారు. ఇక విధుల పట్ల బాధ్యతగా ఉంటూ ఉన్నతాధికారులు చెప్పే ప్రతిపనిని ఎంతో శ్రద్ధతో చేస్తున్నారు. నెలల తరబడి వేతనాలు ఆలస్యమైతే ఇబ్బందులు పడైనా కేంద్ర నిర్వహణలో తన వంతు పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం రెండు కేంద్రాలు ఒకేచోట నిర్వహిస్తుండటంతో బాధ్యతలు మరింతగా పెరగగా అలుపుసొలుపు లేకుండా పాపమ్మ పనులు తన బాధ్యతలకు న్యాయం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణలు, బాలింతలు, చిన్నారులకు వేసే టీకాల సమయంలో ఇంటింటికి తిరిగి వారిని వస్తున్నారు. ఐసీడీఎస్ అంటేనే గ్రామస్థులు అనేక ఫిర్యాదులు చేయడం సర్వ సాధారణం. కాని ఇక్కడ మాత్రం కార్యకర్తలు మొదలు ఆయా వరకు అందరూ బాధ్యతగా పనిచేస్తూ గ్రామస్థుల చేత, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతనూ శభాష్ అనిపించుకున్నారు.



పిల్లలను కేంద్రానికి తీసుకువస్తున్న ఆయా పాపమ్మ



మంత్రి పద్మారావు చేతుల మీదుగా జిల్లా ఉత్తమ అవార్డు అందుకుంటున్న పాపమ్మ

మంత్రి పద్మారావు చేతుల మీదుగా అవార్డు...

భద్రాద్ది కొత్తగూడెం జిల్లాలో ఐసీడీఎస్ ద్వారా ఉత్తమ ఆయాగా ఎంపికైన పాపమ్మ ఆగష్టు 15వ తేదీన కొత్తగూడెంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈఏడాది జరిగిన మహిళా దినోత్సవం సందర్భంగా కూడా పాపమ్మ అవార్డును అందుకున్నారు. అశ్వారావుపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డును, రూ.వెయ్యి నగదును పొందటం జరిగింది.

కష్టం అనుకోకుండా పనిచేస్తా: పాపమ్మ

1991లో ఆయాగా చేరా. అప్పట్లో రూ.100 మాత్రమే వేతనంగా ఇచ్చేవారు. కూలి కూడా రావటం లేదని నాతోపాటుగా చేరిన చాలామంది ఆయాలు మానివేశారు. అయినా నేనుమాత్రం ఇక్కడే ఇరవై ఆరేళ్లుగా కష్టాన్ని ఇష్టంగా మల్చుకుని పనిచేస్తున్నా. మా కార్యకర్తలు సత్యావతి, కల్పన సహకారంతో పనులన్నీ చక్కగా చేసుకుంటాను. జిల్లాస్థాయిలో అవార్డు పొందటం ఎంతో ఆనందంగా ఉంది.

మినీ లోకం



డాక్టర్‌గారు థర్మామీటర్ పెట్టమన్నది నోట్లో..!!

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుదాం

- ఇంటింటికో మరుగుదొడ్డి నిర్మాణంపై స్వచ్ఛ సమరం సాగించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆంధ్రజ్యోతి,కొత్తగూడెం: మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసి మహిళల ఆత్మగౌరవం కాపాడుకుందామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ద్వారా చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలపై బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పంచాయతీ, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖలు చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణ విషయంలో ప్రజలకే ఎక్కువ బాధ్యత ఉండాలన్నారు. పలు రోగాలకు హేతువని తెలిసినా నిర్లక్ష్యం వహించడం సబబుకాదన్నారు. ప్రజల ఆలోచనా సరళి మారాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు ఇసుక ఉచితంగా ఇస్తున్నామన్నారు. మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టగానే రూ. 6వేలు, నిర్మించుకున్నక మరో రూ.6వేలు మంజూరు చేస్తున్నామని, పూర్తి చేసిన నిర్మాణాల బిల్లుల చెల్లింపులకు రూ. 120కోట్లు మంజూరయ్యాయని వివరించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణాల్లో మహిళలే బాధ్యత వహించాలన్నారు. నల్గొండ జిల్లా గుండాలలో మరుగుదొడ్డి లేకపోవడంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడిందని, బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రజిత పూరిపాకలో ఉన్నా.. మరుగుదొడ్డి నిర్మించుకోవడం మహిళా లోకం ఆలోచించాలన్నారు.





సదస్సుకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, మాట్లాడుతున్న స్వచ్ఛభారత్ మిషన్ అధికారి తరుణ్

మనస్సులో నుంచి మార్పు రావాలి

- స్వచ్ఛభారత్ మిషన్ అధికారి తరుణ్

ప్రతీ ఇంటికి మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు మనస్సులో నుంచి మార్పు వస్తేనే ఈ పథకం విజయవంతం అవుతుందని స్వచ్ఛభారత్ మిషన్ ప్రభుత్వ అనుసంధాన అధికారి తరుణ్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మరుగుదొడ్ల నిర్మాణాల ఆవశ్యకతను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జగత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా 43శాతంతో 18వ స్థానంలో ఉందన్నారు. ములకలపల్లి మండలం కుమ్మరి గూడెం పూర్తి గిరిజన గ్రామమైన బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా నిలిచిందన్నారు. అదేబాటలో కొత్తగూడెం వెంకటేష్‌ఖని ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. రాంకిషన్, స్వచ్ఛభారత్ మిషన్ కన్సల్టెంట్స్ శరత్, రవి, తరుణ్, జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కొత్తగూడెం, పాల్వంచ జడ్పీటీసీలు గిడ్లపరం జ్యోతిరావు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

బేడీలు వేయడం చట్ట విరుద్ధం

- మెజిస్ట్రేట్‌కు మాజీ దళకమాండర్ మధు ఫిర్యాదు

ఇల్లెందు: జిల్లా కారాగారంలో ఖైదీగా ఉంటున్న తనను రాజకీయ ఖైదీగా చూడకుండా మరో ఇద్దరి చేతులకు కలిపి బేడీలు వేసి కోర్టుకు తీసుకొస్తున్నారంటూన్యూడెమోక్రసీ నాయకుడు మాజీ దళకమాండర్ ఆవునూరి మధు జిల్లా న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. బుధవారం కోర్టు వాయిదాకు హాజరైన సందర్భంగా మధు తనతో పాటు మరో ఇద్దరికి ఉమ్మడిగా బేడీలు వేశారని చెప్పారు. దొంగల్లాగా పరిగణిస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు.

గెస్ట్‌అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో ఉన్న శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపకులుగా పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎం. వెంకట రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోపు దరఖాస్తులను కళాశాలలో అందచేయాలని, సెప్టెంబర్ 4న కళాశాలలో డెమో ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. అతిథి అధ్యాపకులుగా ఎంకాం, ఎంఎ (ఇంగ్లీష్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎ (కంప్యూటర్, అప్లికేషన్) తదితర సబ్జెక్టుల వారు అర్హులన్నారు.

ఏకలవ్య పాఠశాలలో 68మంది చేరిక

దమ్మపేట: నూతనంగా గండుగులపల్లిలో ఏర్పాటు చేసిన ఏకలవ్య పాఠశాలలో బుధవారం స్పాట్ అడ్మిషన్లు జరిగాయి. ఐదో తరగతిలో 25మంది, ఆరోతరగతిలో 43మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఐదు, ఆరు తరగతులకు ఒక్కో తరగతిలో 80 సీట్లకు అడ్మిషన్లు జరిగాయి. మిగిలిన సీట్లకు ఈనెల 26న పాఠశాలకు రావాలని జిల్లా కన్వీనర్ బుడాన్, ప్రిన్సిపాల్ సీతా కుమారి చెప్పారు.

రామయ్యను దర్శించిన తెలుగు రాష్ట్రాల ఐఏఎస్ అధికారులు



రామయ్యను దర్శించిన తెలుగు రాష్ట్రాల ఐఏఎస్ అధికారులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని బుధవారం రాత్రి తెలుగురాష్ట్రాల్లో పని చేస్తున్న ఐఏఎస్ అధికారులు దర్శించారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రా, జాయింట్ కలెక్టర్ ఎం. మల్లికార్జున్, రాజమండ్రి మునిసిపల్ కమిషనర్ విజయరామరాజు, అసిస్టెంట్ ఆనంద్ రామయ్య దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనమంతు ఆధ్వర్యంలో దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈక్రమంలో ఆలయ అర్చకులు ఆలయ ప్రాశ్యస్యాన్ని వివరించారు.ఈకార్యక్రమంలో వారి వెంట చింతూరు ఐటీడీఏ పీవో జి. చినబాబు, భద్రాచలం ఆర్డీవో బి. శివనారాయణరెడ్డి, ఎటపాక ఆర్డీవో ఎల్లారమ్మ, ఎటపాక తహసీల్దార్ చింతామణి, భద్రాద్రి దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు నర్సింహరాజు, ఎటపాక వీఆర్వో పండారామకృష్ణ పాల్గొన్నారు. టీఎస్ ఆర్టీసీ విజిలేన్స్ జాయింట్ డైరెక్టర్ వెంకట్రావ్, ఖమ్మం ఆర్ఎం శివకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యావిభాగం జిల్లా నోడల్ అధికారిగా మాధవరావు



కొత్తగూడెంఅర్బన్:విద్యావిభాగం జిల్లా నోడల్ అధికారిగా చాతకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎస్.మాధవరావు నియమితులయ్యారు. 2005 ప్రధానోపాధ్యాయులు బ్యాచ్‌కు చెందిన మాధవరావు గతంలో నాలుగు సంవత్సరాలపాటు భద్రాచలం మండల విద్యాశాఖాధికారిగా పని చేశారు.

మీ కుటుంబానికి అండగా పోలీస్‌శాఖ

- కానిస్టేబుల్ రమేష్‌కు ఎస్పీ హామీ



రమేష్‌తో ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఆంధ్రజ్యోతి,కొత్తగూడెం:ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, మీ కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా ఉంటుందని ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా ధైర్యం చెప్పారు. ఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్ రమేష్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ రమేష్ కొన్ని నెలల క్రితం ద్విచక్రవాహనం ప్రమాదంలో కాలును పోగొట్టుకున్నాడు. కృత్రిమ కాలును రమేష్‌కు అమర్చారు.ఎస్పీ సహకారంతో ఆరోగ్యభద్రత నుంచి చికిత్స చేయించారు. దీంతో బుధవారం రమేష్ కుటుంబ సభ్యులతో ఎస్పీ కార్యాలయానికి వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు. కృత్రిమకాలు పనితీరును ఎస్పీ పరిశీలించారు.

కాంగ్రెస్‌లో చేరిన విశ్రాంత తహసీల్దార్

మణుగూరు: పినపాక విశ్రాంత తహసీల్దార్ కోటేశ్వరరావు, మణుగూరుకు చెందిన అడపా అప్పారావు, పలువురు రేషన్ షాపు డీలర్‌లు బుధవారం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రేగా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు చిడెం అంజమ్మ, నాయకులు పోశం నర్సింహారావు, సత్యనారాయణ, యాదగిరి గౌడ్, బాబ్‌జాని, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

మణుగూరు

● సత్యభాస్కర — జయజానకి నాయక

● సీతారామ — ఫిదా

మణుగూరు మండల అధికారుల సమాచారం

తహసీల్దార్	:	9849 906092
ఎంపీడీవో	:	9440 906948
ఎంఈవో	:	9440 890114
వ్యవసాయాధికారి	:	7288 894259
డీఎస్పీ	:	9440 795326
సీఐ	:	9440 795327
ఎక్సైజ్ సీఐ	:	9440 902685
విద్యుత్ ఏడీఈ	:	9440 811536
విద్యుత్ ఏఈ	:	9440 811555
ఇరిగేషన్ ఏఈ	:	9701 362564
పీఆర్ ఏఈ	:	9492 960748
టెలికం ఏఈ	:	9440 326999
వైద్యాధికారి	:	9550 791319
పశువైద్యాధికారి	:	9866 341589
ఆర్టీసీ డీఎం	:	7382 825963
ఐకేపీ ఏపీఎం	:	9704 789728

వినాయక మండపాల ముస్తాబు

విక్రయానికి సిద్ధంగా విగ్రహాలు ● వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న ఆకృతులు ● నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి



విక్రయానికి సిద్ధంగా భారీ విగ్రహం

మణుగూరు రూరల్: మండలంలో వినాయక నవరాత్రుల నిర్వాహణకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వినయక మండపాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. శుక్రవారం నిర్వహించనున్న వినాయక చవితికి వివిధ ఆకృతుల్లో విగ్రహాలను సిద్ధంగా ఉంచారు. విగ్రహ సైజును బట్టి ధరను నిర్ణయించారు. రూ.వంద నుంచి నాలుగు వేల వరకూ విగ్రహాల ధరను నిర్ణయిచారు. పట్టణంలోని ఎస్‌బీహెచ్ ప్రాంతంలో, గుట్టమల్లారంలోని వేద గాయత్రిమాతాలయం పక్కన ఈ విగ్రహాలను విక్రయిస్తున్నారు. మట్టి గణపతి విగ్రహాలనే ఉయోగించి పర్యావరణాన్ని కాపాడలని రెడ్ క్రాస్ సోసైటీ సభ్యుడు జెవిఎస్ చంద్రశేఖర్ భక్తులను కోరుతున్నారు.

మట్టి ప్రతిమల తయారీ

మణుగూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే వాడాలని కోరుతూ.. స్థానిక శ్రీ విద్య విద్యాలయం విద్యార్థులు బుధవారం మట్టి విగ్రహాలను తయారుచేసి.. పంపిణీ చేశారు. రాజీవ్‌గాంధీ నగర్‌లో ఈ విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నూకరపు రమేష్, పిన్సిపాల్ సాంబశివారెడ్డి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే ఉపయోగించాలని కోరారు. ఈ చర్యల్లో భాగంగానే తమ విద్యార్థులచే మట్టి ప్రతిమలను తయారు చేయించామని అన్నారు. సాధారణంగా విగ్రహాలకు వాడే రంగుల వల్ల వాతావరణ కాలుష్యం సైతం ఏర్పడుతుందని అన్నారు. దీనిని నివారించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాణీ, నిహారిక, శారద, నరెందర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబవుతున్న మండపం



మట్టి వినాయక ప్రతిమను అందజేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

బూర్గంపాడు: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలకు చిరు నవ్వులతో వివాహాలు జరిపించాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 18 మంది మహిళలకు చెక్కులు పంపీణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు కైపు రోశిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు భట్టా విజయగాంధీ, తహసీల్దార్ కె.వి.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వ్యసాయమార్కెట్ కమిటీ చైర్మన్ విజయ నిర్మల, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, టీఆర్ఎస్ నాయకులు వీరంరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిన్నపరెడ్డి, తోటమళ్ల భిక్షం, కైపు సుబ్బరామిరెడ్డి, మారశ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎస్ఐపై ఫిర్యాదు

బూర్గంపాడు ఎస్ఐ గుర్రం ఉదయ్‌కిరణ్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఎంపీటీసీ సభ్యుడు వల్లూరిపల్లి వంశీకృష్ణ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మండలంలో తరచూ దొంగతనాలు జరుగుతున్నా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం లేదన్నారు. చోరీలకు సంబంధించి.. బాధితులు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఎస్ఐ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు.

'మహిళల ఆర్థికాభివృద్ధికే వృత్తి శిక్షణ'

మణుగూరు రూరల్: సింగరేణి పరిసర ప్రాంతాల మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే సింగరేణి సేవా సంస్థ ద్వారా మహిళలకు వృత్తి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఏరియా అధికార ప్రతినిధి రేవు సీతారాం అన్నారు. సింగరేణి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను బుధవారం ఆయన ప్రారంభించి.. మాట్లాడారు. ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని.. ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు ఉమారాణి, వెల్ఫేర్ ఆఫీసర్ సింగ్ శ్రీనివాస్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, రాయుడు సీతారామ్ పాల్గొన్నారు.



తరగతులను ప్రారంభిస్తున్న దృశ్యం

గిరిజన పిల్లలను విద్యకు దూరం చేయ్యొద్దు: టీపీటీఎఫ్

గుండాల: గిరిజన పిల్లలను విద్య దూరం చేయ్యొద్దని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాచారి కోరారు. రాంబాబు అధ్యక్షతన బుధవారం గుండాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయ నియమాకాలు చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.కాంతారావు, సరియా, వెంకన్న, రామయ్య, వెంకటేశ్వర్లు, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఏడూళ్ల బయ్యారం సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

పినపాక: ఏడూళ్లబయ్యారం సీఐ జయపాల్‌పై.. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నేతృత్వంలో బుధవారం కొంత మంది బాధితులు కొత్తగూడెం ఎస్పీ అంబర్ కిషోర్ ఝాకి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారని రేగా తెలిపారు. భద్రాచలం ఏఎస్పీ సునీల్‌దత్‌ని విచారణ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

వైన్‌షాపులో చోరీ

● సీసీ పుటేజీల ఆధారంగా దొరికిన దొంగ

గుండాల: మండల కేంద్రంలోని కనకదుర్గా వైన్‌షాపులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఈ సందర్భంగా రూ.40వేలు అపహరణకు గురయ్యాయి. వైన్‌షాపు నిర్వహకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుండాల ఎస్ఐ వడ్లకొండ సురేష్ కేసు నమోదు చేశారు. వైన్‌షాపులోని సీసీ పుటేజీలను పరిశీలన చేయగా, ముత్తాపురం గ్రామానికి చెందిన పూనెం లక్ష్మీనారాయణ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. లక్ష్మీనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ నిర్వహించారు. దొంగిలించిన సొమ్మును మండల కేంద్రంలోని మహలక్ష్మీ ఆలయం వెనుక పాతి పెట్టినట్లు అంగీకరించాడు. రూ.35 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

30 శాతం కార్మికులకు చెల్లించాలి: ఏఐటీయూసీ

మణుగూరు: సింగరేణి సంస్థకు ఈ ఏడాది వచ్చిన లాభాల్లో కార్మికులకు 30 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని కోరుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సభ్యుడు నామా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది సుమారు రూ. 15వందల కోట్ల మేరకు సంస్థకు లాభాలు వచ్చాయని, అందులోనుంచి 30 శాతం కార్మికులకు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంగోపాల్, శ్రీనివాస్, అంజయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

అశ్వాపురం: సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎస్ఈఏ ప్రధాన కార్యదర్శి ఎస్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మల్లెలమడుగు పాఠశాల కాంప్లెక్స్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత పెన్షన్ సాధన కోసం సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.



సెలవు చీటీలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

ఆరోగ్య ఉపకేంద్రాల విలీనం

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం, మారాయిగూడెం ఆరోగ్య ఉపకేంద్రాలను దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విలీనం చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాదయానందస్వామి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో దుమ్ముగూడెం పరిధిలో ఉన్న మంగు వాయబాడవ ఉపకేంద్రాన్ని పర్ణశాల పీహెచ్‌సీలోనూ, భద్రాచలంలోని ఎనిమిది ఆరోగ్య ఉపకేంద్రాలను నరసాపురం పీహెచ్‌లోనూ సర్దుబాటు చేశారు.

సినిమాలు

భద్రాచలం

- ఉదయభాస్కర్ ఫిదా
- విజయభాస్కర్ మాయామాల్
- గోపాలకృష్ణ గౌతమ్ నంద
- శివం (సారపాక) ఫిదా

దుమ్ముగూడెం అధికారుల సమాచారం

తహసీల్దార్	:7680026361
ఎంపీడీఓ	:9440906956
ఎస్‌ఐ	:9440795307
ఎంఈఓ	:9912170410
రేంజిఅధికారి	:9440810347
విద్యుత్‌శాఖ ఏఈ	:9440811554
మండల ఏఓ	:7288894265
పీఆర్ జేఈ	:9440564966
ఈఓఆర్డీ	:9492091891
ఎక్సైజు సీఐ	:9440902683
వెటర్నరీ వైద్యుడు	:9704068729
దుమ్ముగూడెం పీహెచ్‌సీ	:9989027131
నరసాపురం పీహెచ్‌సీ	:8977425496
పర్ణశాల పీహెచ్‌సీ	:9963300896
తాలిపేరు డీఈ	:7075238444
ఇరిగేషన్ ఏఈ	:9100040649
టెలికాం ఏఈ	:9441558855

మట్టి గణపతినే పూజిద్దాం

- భద్రాచలం ఏఎస్పీ సునీల్ దత్
- రెండు ప్రాంతాల్లో విగ్రహాల పంపిణీ



విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఏఎస్పీ

భద్రాచలం: మట్టి గణపతినే పూజించి పర్యావరణ పరిరక్షణకు పాడుపడదామని భద్రాచలం ఏఎస్పీ సునీల్ దత్ అన్నారు. భద్రాచలంలో బుధవారం బస్‌స్టాండ్ ఎదురుగా ఉన్న రోటరీ బస్ షెల్టర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. నేటితరం మనపండుగలు, పర్వదినాల మఖ్య ఉద్దేశాన్ని విస్మరించి చెడు ఫలితాలకు కారణం అవుతున్నారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ బి.శంకర్‌రెడ్డి, కార్యదర్శి కేవీ రమణ, లయన్స్ క్లబ్ కార్యదర్శి మాధవరెడ్డి, సభ్యులు చైతన్య, శ్రీధర్, పి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. భద్రాచలంలోని క్రాంతి విద్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. విద్యా సంస్థల డైరెక్టర్ సోమరౌతు శ్రీనివాసరావు, కరస్పాండెంట్ సమతా శ్రీనివాసు విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

ముస్తాబవుతున్న వినాయక పందిళ్లు

భద్రాచలంలో శుక్రవారం నుంచి జరగనున్న గణేష్ నవరాత్రులకు ఉత్సవ మండళ్ల ఆధ్వర్యంలో పందిళ్లను ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల పందిళ్లను సైతం పూర్తి చేసి ఇతర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భద్రాచలంలోని యూబీ రోడ్డు, చాంబర్ ఆప్ కామర్స్, చప్టా దిగువ, యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో, తాత గుడి సెంటర్లో, ఎల్‌ఎఫ్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో, కూనవరం రోడ్డుతోపాటు పట్టణంలోని పలు చోట్ల గణేష్ నవరాత్రులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అందుకు తగ్గట్టుగా సెట్టింగ్‌లతో పందిళ్లను సిద్ధం చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీగ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన పందిళ్లతో సందడి వాతావరణం నెలకొంది. అలాగే విగ్రహాలను సైతం పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో భారీ విగ్రహాలను అమ్మకానికి సిద్దంగా ఉంచారు. అలాగే అయ్యప్పస్వామి ఆలయం వద్ద రాజస్థాన్ కళాకారులచే తయారు చేసిన భారీ విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. ఇప్పటికే అడ్వాన్సు బుకింగ్ కింద విగ్రహాలను సైతం బుక్ చేసుకొన్నారు. ఈ విగ్రహాలను శుక్రవారం ఉదయం భారీ ఊరేగింపు మధ్య తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విగ్రహ సైజును బట్టి ధరలను నిర్ణయించారు. ఇదిలావుండగా మట్టి విగ్రహాలనే వాడాలని పలు స్వచ్ఛంద సంస్థలు ప్రచారం నిర్వహిస్తున్నాయి. అందుకు తగ్గట్టు విగ్రహాలను పంపిణీ చేస్తున్నాయి.



తాతగుడి సెంటర్‌లో సెట్టింగ్

ఏఐవైఎఫ్ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులు

దుమ్ముగూడెం: ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. లక్ష్మీనగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నప్పటికీ యువతకు ఒరిగింది ఏమీ లేదన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా వేణు, అధ్యక్షుడిగా ఎంనర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌తోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మం డల సహాయ కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వీరభద్రం, సత్తిబాబు, శీను, వీరాస్వామి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలగా మారనున్న వసతిగృహం



వసతిగృహం..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గిరిజన విద్యార్థుల వసతిగృహం సెప్టెంబరు ఒకటి నుంచి గిరిజన బాలుర ఆశ్రమపాఠశాలగా మారనుంది. ఇప్పటికే ఉత్తర్వులు వెలువడ్డాయి. మూడు నుంచి ఐదోతరగతి వరకు విద్యాభోధనకు ఏర్పాట్లు జరుగుతున్నాయని డీడీ సీహెచ్ రాంమూర్తి తెలిపారు. ప్రస్తుతం మూడు నుంచి ఐదు తరగతుల వరకు వసతి గృహంలో కేవలం తొమ్మిది మంది విద్యా ర్థులు మాత్రమే ఉన్నారు. సమీప గిరిజన పరిషత్ పాఠశాలల నుంచి తరలిస్తామని తెలిపారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారం వైభవంగా నిత్య కల్యాణం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారిని నిత్య కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకురాగా సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ చేశారు. యోక్త్రబంధనం, కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, బ్రహ్మముడి, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కల్యాణాన్ని చూసి తరించారు.

ముంపు పొలాలను పరిశీలించిన ఆర్డీవో

బూర్గంపాడు: బూర్గంపాడు గ్రామ శివారులోని పోలవరం ముంపునకు గురువుతున్న పంటపోలాలను బుధవారం భద్రాచలం ఆర్డీవో బి. శివనారాయణరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ముంపుకు గురువుతున్న పోలాలను గుర్తించి, పాతిన గుర్తింపు రాళ్లను ఆయన పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ కైపు రోశిరెడ్డి, తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, ఆర్‌ఐ రాంబాబు, వీఆర్వో వరలక్ష్మీ రైతులు మారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

దుమ్ముగూడెం: మండలంలోని గోవిందాపురానికి చెందిన కొమరం చంటి, కొమరం సత్తిబాబు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చర్ల మండలం రాళ్లగూడెం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ఇరువురికి తలభాగంలో తీవ్రగాయలయ్యాయి. వీరిని ప్రైవేటు వాహనంలో తొలుత దుమ్ముగూడెం పీహెచ్‌సీకు తరలించారు. అనంతరం 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్చారు.

'అనుమతి తప్పనిసరి'

ఆళ్లపల్లి: వినాయక చవితి మండపాలకు పోలీసు, విద్యుత్ శాఖ వారి అనుమతి తప్పనిసరని ఆళ్లపల్లి ఎస్సై మేకల కుమార స్వామి అన్నారు. బుధవారం స్థానిక కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండపం వద్ద ఒక సభ్యుడు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు.

అస్తవ్యస్తంగా డ్రెయిన్లు..

- దుర్వాసనతో ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

కరకగూడెం: మండలంలో డ్రెయినేజ్ వ్యవస్థ అస్త వ్యస్తంగా తయారైంది. డ్రెయిన్లలో నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త తొలగించకపోవడంతో మురుగునీరు పారే అవకాశం ఉండటం లేదు. మండల కేంద్రంలోని కరకగూడెం గ్రామ పంచాయతీలో నాలుగు సంవత్సరాల క్రితం సుమారు సుమారు రూ.15 లక్షలతో నిర్మించిన డ్రెయినేజ్ అస్తవ్యస్తంగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడి మాంసం దుకాణదారులు వ్యర్థాలను డ్రెయిన్‌లో పడేస్తుండటంతో నీరు పారే దారి కనపడటం లేదు. వర్షాలు పడిన సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. నీరు నిల్వ ఉండి.. దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. దాంతోపాటు దోమలు చేరి.. వ్యాధులకు కారణమవుతున్నాయని వాపోతున్నారు.

దుర్వాసన భరించలేకున్నాం..

ముయలమ్మ, హోటల్ యజమానురాలు

వర్షపు నీరు నిల్వ ఉండటం కోళ్లను కోసిన రక్తం నీరుతో దోమలు, ఈగలు వెదలజ్లుతున్నాయి. దుర్వాసన భరించలేకపోతున్నాం. చిన్న పిల్లలతో అనేక అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.



డ్రెయిన్‌లో నిల్వ ఉన్న చెత్త

డ్రెయినేజ్‌ను శుభ్రం చేయించాలి

ముత్తంశెట్టి ప్రసాద్, గ్రామస్తుడు

డ్రెయిన్‌లో చెత్తను తొలగించాలి. చెత్త నిల్వ ఉండటంతో నీరు పారడటం లేదు. అదికారుల స్పందించి డ్రైనేజీలు శుభ్రం చేయించి.. నీటి నిల్వను తొలగించాలి.

ఖమ్మంలో భారీ చోరీ

- 70తులాల బంగారం, ఐదుకిలోల వెండి చోరీ
- శ్రీరాంహిల్స్‌లో ఘటన




చోరీ జరిగిన ఇల్లు, ధర్వాజా పేడు తొలగించిన ప్రాంతం

ఖమ్మంక్రైం: ఖమ్మంనగరంలో బుధవారం భారీ చోరీ జరిగింది.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చాకచక్యంగా నగలను అపహరించారు.. వీటి విలువ దాదాపు రూ. రూ.20లక్షల వరకు ఉంటుందని అంచనా. నున్నా రాధాకృష్ణ ఇంటి ప్రధాన తలుపును, లోపల కప్‌బోర్డ్‌లోని ఇనుప లాకర్‌ను అత్యంత నైపుణ్యంగా పగల గొట్టారు. ఇంట్లో వస్తువులను ఏమాత్రం చిందర వందర చేయకుండా కేవలం తమకు కావాల్సిన వస్తువులను మాత్రమే ఎత్తుకెళ్లారు.ఇంటికి సంబంధించిన వివరాలు పూర్తిగా తెలిసిన వారో లేక దొంగతనాల్లో ఆరి తేరిన ప్రొఫెషనల్ దొంగల పనో అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు.. ఇంట్లోకి ప్రవేశించే ప్రధాన ద్వారం వద్ద తలుపుకు సంబందించిన ధర్వాజ కమ్మిని ఒక పేడు మందం తొలిచారు.. అత్యంత పటిష్టంగా ఉన్న లాకర్‌ను ఏమాత్రం దెబ్బ తినకుండా తెరవటం గమనార్హం.. రాధాకృష్ణ నర్సంపేటలో పీడీగా పనిచేస్తుండటంతో ఆయన విధుల నిర్వహణకు అక్కడే ఉంటున్నారు.. తల్లి మరణించటంతో ఆయన భార్య రెండు రోజుల క్రితం కొత్తగూడెం వెళ్లారు.. ఇంట్లో ఎవరూ లేక పోవటంతో దొంగతనానికి ఆస్కారం ఏర్పడింది. ఇంటి తలుపు కొద్దిగా తెరిచి ఉండటంతో పని మనిషి వచ్చి చూసింది.. ధర్వాజ పగల గొట్టి ఉండటం,పిలిచినా ఎవరూ పలకపోవటంతో ఇరుగు పొరుగు వారికి చెప్పగా వారు రాధాకృష్ణకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. బాధితుడు రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఇటీవలే వివాహమైన తన కూతురు నగల భద్రత కోసం తమ ఇంట్లో దాచిందని చెప్పారు.. దోపిడీలో ఈ నగలన్నీ పోయాయని వాపోయాడు. ఈవిషయమై అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన ప్రదేశాన్ని ఏసీపీ గణేష్ పరిశీలించారు.

నగరంలో షోలాపూర్ గ్యాంగ్?

షోలాపూర్‌కు చెందిన ఆరితేరిన దొంగలు ఈ దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. కొద్ది రోజులుగా ఖమ్మంలో వరుసగా చోరీలు నమోదవు తున్న విషయం తెలిసిందే. మహిళల మెడలో బంగారు నగలను లాక్కెళ్లటంతో పాటు, ఆర్టీసీ బస్సులో బంగారు వ్యాపారి నుంచి రెండు కిలోల బంగారం చోరీ, శ్రీరాం హిల్స్‌లోని భారీ చోరీ, పలు ప్రాంతాల్లో చోరీకి యత్నాల తీరు చూస్తుంటే దొంగతనాల్లో చేయి తిరిగిన బ్యాచ్ పనిగా భావిస్తున్నారు.. పలుప్రాంతాల్లో సేకరించిన సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా అనుమానితులను గుర్తించారు. వీరు షోలాపూర్‌కు చెందిన వారుగా భావిస్తున్నారు. వీరి కోసం ఖమ్మం నుంచి పోలీస్ బృందం షోలాపూర్‌కు వెళ్లినట్లు సమాచారం.

అమ్మా.. అనిపించుకునేలోపే..

అస్వస్థతతో తల్లి.. గర్భంలోనే చిన్నారి మృతి

వెక్కిరించిన పేదరికం.. అశ్వారావుపేటలో విషాదం



శిరీషమృతదేహం

అశ్వారావుపేట రూరల్/ టౌన్: తొమ్మిది నెలల పాటు అష్టకష్టాలు పడి కడుపులో బిడ్డను మోసింది. మరి కొద్ది గంటల్లోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చి అమ్మ అనిపించుకోవాలని ఎంతో ఆత్రుతగా ఎదురు చూసింది. అంతలోనే అనుకోని సంఘటనతో అస్వస్థతకు గురైంది. బిడ్డకు జన్మనిచ్చేలోపే అనంతలోకాలకు వెళ్లింది. చిన్నారి కూడా బాహ్య ప్రపంచాన్ని చూడకుండానే గర్భంలోనే తనువు చాలించింది. అందరూ సంతోషంతో ఉన్న వేళ ఊహించని సంఘటనతో అందరూ ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగిపోయారు. పేదరికం వీరిని వెంటాడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని నారాయణపురానికి చెందిన ఆకుల సత్యనారాయణ, నాగమణి కూతురు శిరీష(24)కు ఏపీ రాష్ట్రంలోని కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామానికి చెందిన బొందుల శేఖర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. శిరీషకు మొదటి కాన్పు సమయంలో పెద్దాపరేషన్ చేసి ప్రసవం చేశారు. ప్రస్తుతం వీరికి రెండేళ్ల రాంపండు ఉన్నాడు. రెండో కాన్పు కోసం శిరీష తన తల్లిదండ్రుల ఊరు నారాయణపురం వచ్చింది. ఇక్కడే ఉంటూ వైద్యసేవలు పొందుతోంది. ప్రసవ సమయం దగ్గర పడుతుండటంతో ఆసుపత్రిలో చేరేందుకు నిశ్చయించుకున్నారు. ఇదే సమయంలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో శిరీషకు ఒక్కసారిగా పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఆసుపత్రికి వెళ్దామనుకునేలోపే నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు 108 ద్వారా అశ్వారావుపేటలోని ఓప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అప్పటికే శిరీషకు అధికంగా రక్తస్రావమై పరిస్థితి విషమించింది. ఆపరేషన్ చేయాల్సి వస్తుందని, వెంటనే ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. పేదరికంతో మగ్గుతున్న శిరీష తల్లిదండ్రులు అతి కష్టమ్మీద నగదు సమకూర్చుకున్నారు. ప్రైవేటు వాహనంలో ఖమ్మం బయలు దేరారు. సత్తుపల్లికి చేరుకోగానే పరిస్థితి విషమించింది. గత్యంతరం లేక అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసేలోపే శిరీష మృతి చెందింది. ఆమెతో పాటే కడుపులో ఉన్న పసికందు మృతిచెందింది. శిరీష మృతితో కుటుంబసభ్యులు బోరున విలపించారు. చిన్నతనంలో తల్లిని కోల్పోయిన రెండేళ్ల రాంపండును చూసి పలువురు కన్నీరు పెట్టుకున్నారు.

వివాహిత ఆత్మహత్య

అన్నారం, (ములకలపల్లి): కడుపు నొప్పి తట్టుకోలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో జరిగింది. పూసుగూడెం పంచాయతీ అన్నారం గ్రామానికి చెందిన తాటి సారయ్య, రాములమ్మ దంపతులకు తాటి జ్యోతి (18) అనే కుమార్తె ఉంది. ఆమెను ఇదేమండలంలోని జగన్నాధపురం పంచాయతీ రాచన్నగూడేనికి చెందిన వూకే చిన్న రాజులుతో ఆరునెలల క్రితం వివాహమైంది. వివాహ అనంతరం పాల్వంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈక్రమంలో జ్యోతి మంగళవారం అన్నారంలోని పుట్టింటికి వచ్చింది. సాయంత్రం ఇంటివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కడుపునొప్పి కారణంగా ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

800 లీటర్ల నీలి కిరోసిన్ పట్టివేత

నేలకొండపల్లి : ఖమ్మం జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న 800 లీటర్ల నీలికిరోసిన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం నేలకొండపల్లి మండలం రాయిగూడెంవద్ద స్వాధీనం చేసుకున్నారు. తెల్దారుపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ బాబు నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన జి.వెంకన్న గ్రామాల్లో నీలికిరోసిన్ సేకరించారు. తెల్దారుపల్లి నుంచి ఏపీలోని కృష్ణా జిల్లాలోని జిల్లా షేర్ మహ్మద్ పేటకు కొద్దిరోజులుగా అక్రమంగా కిరోసిన్‌ను ఏపీకీ తరలిస్తున్నారు. బుధవారం కిరోసిన్‌ను తరలిస్తుండగా సమాచారం అందుకున్నారు. తనిఖీలు నిర్వహించి 800 లీటర్ల నీలి కిరోసిన్, ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

బీసీ గురుకులంలో వికటించిన పాలు

- 21 విద్యార్థినులకు తీవ్రఅస్వస్థత
- ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే ఆగ్రహం,కలెక్టర్‌కు ఫిర్యాదు



చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట టౌన్/ అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కల్తీపాలు తాగి 21మంది విద్యార్థినులు బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే, ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.నూతనంగా ఏర్పాటు చేసిన ఈ గురుకుల బాలికల పాఠశాలలో 47మంది విద్యార్థినులు ఉన్నారు. బుధవారం ఉదయం అల్పాహారానికి ముందు వారికి పాలు అందజేశారు. పది నిమిషాల్లో ఒక్కరొక్కరుగా తీవ్రఅస్వస్థతకు గురయ్యారు. ఊపిరి ఆడకపోవడం, చేతులు వంకరలు తిరిగిపోయాయి. మొత్తం 21మంది విద్యార్థినిలు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో పాఠశాల సిబ్బంది పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డీఎంహెచ్ఎంఓ డా.దయానందస్వామి విద్యార్థినులను పరిశీలించారు. వీరిలో తీవ్రఅస్వస్థతకు గురైన సాయి సౌమ్య, ఇందు ప్రియ, కొనకళ్ళక ఇందుతో పాటుమరో ఇద్దరిని మెరుగైన వైద్యంకోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.

కక్కుర్తే ఘటనకు కారణం

పాఠశాలకు పాలను సరఫరా చేసేందుకు దమ్మపేటకు చెందిన కాంట్రాక్టర్ టెండర్‌ను పొందారు. నిబంధనల ప్రకారం విజయపాలను సరఫరా చేయాల్సిఉంది. అయితే కాంట్రాక్టర్ విజయపాలను కాకుండా పట్టణంలోని ఓ దుకాణం నుంచి తిరుమలపాలను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారు. నాణ్యమైన పాలు కాకుండా తక్కువ ధరకు టోన్డ్ మిల్క్ ప్యాకెట్లును కొనుగోలు చేస్తున్నారు. కాం ట్రాక్టర్‌తో కుమ్మక్కైన ప్రిన్స్‌పాల్, వార్డెన్‌లు తక్కువ ధరతో కొనుగోలు చేసిన పాలను అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం పాలు వికటించి పిల్లలకు అస్వస్థతకు కారణంగా చెపుతున్నారు.

కుళ్లిన కూరగాయలు.. బూజుపట్టిన మిరపకాయలు

పాఠశాలలో కుళ్లిన కూరగాయలు, బూజుపట్టిన ఎండిమిర్చి కనిపించాయి. కారం, ఉప్పు, పసుపువంటి నాణ్యతలేని సరుకులు కనిపించాయి. పొంగళిలో చట్నీకి బదులు చారును తయారు చేశారు. పాఠశాలలో కోడిగుడ్లు, అరటిపండ్లు వంటికి ఎక్కడా కానరాలేదు.

ప్రిన్సిపాల్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థినులను ట్రైకార్ ఛైర్మన్, ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. అనంతరం పాఠశాలను సందర్శించారు ప్రిన్స్‌పాల్ కృష్ణవేణిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మీ పిల్లలకైతే ఇలాంటి భోజనం పెడతారా... ఇలా చేస్తే మీ ఉద్యోగాలు ఊడతాయంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడనుంచే కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు పాఠశాల పరిస్థితి, సిబ్బంది, కాంట్రాక్టర్ల అక్రమాలపై ఫిర్యాదు చేశారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. కాగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాలు, బూస్ట్ శాంపిల్స్‌ను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- ఉద్యోగాలపేరుతో మోసం
- కేసులో విచారిస్తుండగా ఘటన

మధిర: ఖమ్మంజిల్లా మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు వెంటనే గుట్టుచప్పుడు కాకుండా ఖమ్మంలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. భూపాలపల్లి జిల్లా ఏటూరి నాగారం మండలం దాట్ల గ్రామానికి చెందిన పాయం నాగలక్ష్మి, ఆలియాస్ కల్పన, చంద్రకళ అనే మహిళ వేణు అనే వ్యక్తిని పెళ్లిచేసుకుంది. కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం సత్యాలపాడులో నివాసముం టోంది. ఈమె వడ్డీలతోపాటు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తోంది. ఈక్రమంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మధిర మండలంలోని ఆత్కూరు, అంబారుపేట, బంజారా కాలనీ, చింతకాని మండలంలోనూ మోసాలకు పాల్పడినట్టు పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. మధిర టుటౌన్‌లోని బంజారాకాలనీకి చెందిన కంపరాజు లక్ష్మయ్య పోలీసుకు ఫిర్యాదు చేశారు. తన ఇద్దరు కొడుకులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.5లక్షలు తీసుకొని మోసగించిందని ఫిర్యాదు చేశారు. పోలీసులు బుధవారం మధ్యాహ్నం సత్యాలపాడు నుంచి కల్పనను విచారణ పేరుతో తీసుకువచ్చారు. స్టేషన్‌లో విచారణ చేస్తుండగానే బాత్‌రూమ్‌కు వెళ్లి అందులోనే కొంగుతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం గ్రహించిన పోలీసులు వెంటనే ఓప్రత్యేక వాహనంలో గుట్టుచప్పుడు కాకుండా ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నట్టు సమాచారం.ఇదిలా ఉండగా ఈ విషయమై టౌన్ ఎస్ఐ తిరుపతిరెడ్డిని వివరణ కోరగా విచారణ కోసం తీసుకువచ్చిన ఆమెకు వాంతులు అయి నీరసంగా ఉండటంతో ఆసుపత్రికి పంపించినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని పేర్కొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు భాగస్వామి సహకారం లభిస్తుంది. కృషి రంగంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. సంకల్పం నెరవేరుతుంది. ప్రియతములతో విందు వినోదాల్లో పాల్గొంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. క్యాటరింగ్, వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం.

మిథునరాశి: (మే21-జూన్21): ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల రాకతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ప్రోత్సాహకరం. సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): రవాణా, ఏజెన్సీలు, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో కొత్త ప్రయోగాలకు తగిన సమయం. సంకల్పం నెరవేరుతుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారికి ఉల్లాసంగా ఉంటుంది. ఒక సమాచారం ఆహ్లాదం కలిగిస్తుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. సినీ, రాజకీయ, ఫొటోగ్రఫీ, ఎగుమతుల రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఒక సమాచారం ఉత్సాహం కలిగిస్తుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సంబంధించిన పనులు పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వేడుకలు, సమావేశాల్లో ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రులతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పూర్వమిత్రులను కలుసుకుంటారు. లక్ష్య సాధనలో గత అనుభవం తోడ్పడుతుంది. ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం లభిస్తుంది. భాగస్వామి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో పాల్గొంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆలయ సమాచారం..

జమలాపురం వెంకన్న



కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
టీటీడీ సత్రం	12	00
సీహెచ్ఎన్ఎన్	10	05

సంప్రదించాల్సిన ఫోన్ నెం: 08749-279855
ఈవో రమణమూర్తి: 94910 00705
ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 99895 07300

- తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.
- 5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.
- 6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.
- ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.
- 7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.
- 10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.
- సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.

భద్రాచలం రామయ్య

కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
కాటేజీలు	26	15
వందగదుల సదనం	62	39
శ్రీరామ సదనం	18	12
టీటీడీ సదనం	26	16
సౌమిత్రి సదనం	30	21

సంప్రదించండి..
దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671



తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.

ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20

నిత్య సేవలు ఇలా..

- తెల్లవారుజామున 4.30కి సుప్రభాతసేవ.
- 5.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, నివేదన సేవాకాలం.
- ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సహస్రనామార్చన.
- 8.30 నుంచి 11.30 వరకు, 12.30 నుంచి 1గంట వరకు, 3 నుంచి 8 గంటల వరకు మూల వరుల వద్ద అర్చన.
- 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు నిత్య కల్యాణం.
- 11.30 నుంచి 12గంటల వరకు రాజభోగం.
- మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఆలయ తలుపులు మూస్తారు.
- రాత్రి 7గంటల నుంచి 8 వరకు దర్బారు సేవ.
- 8.30 నుంచి 9 గంటల వరకు నివేద బోగం అనంతరం పవళింపు సేవ. ఆ తర్వాత ఆలయం తలుపులు మూస్తారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంటల ధరలు (క్వింటాలుకు రూపాయల్లో)

పంట	కనిష్ఠం	నమూనా	గరిష్ఠం
పత్తి	3000	4,600	5,100
మిర్చి	2,000	3,800	5,400
మిర్చి (తాలు)	1,000	1,200	1,500
కందులు	3,800	4,000	4,426
పెసలు	3,011	4,000	5,150
మొక్కజొన్న	-	-	-
బొబ్బర్లు	-	-	-
మినుములు	-	-	-
వేరుశనగ	-	-	-





- ఖమ్మం స్పోర్ట్స్

ఉష్ణోగ్రత వివరాలు సెల్సియస్ డిగ్రీల్లో..

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	25	33
కొత్తగూడెం	24	33

27నుంచి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

చైర్‌పర్సన్ రేణుకాచౌదరి ఆధ్వర్యంలో 20 మంది ఎంపీల రాక
అడవులు, కాలుష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీపై పరిశీలన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-ఖమ్మం)
జిల్లాలో అడవులు, కాలుష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలను పరిశీలించేందుకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాబోతుంది. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి చైర్‌పర్సన్ హోదాలో 20 మంది వివిధ పార్టీల ఎంపీల బృందం ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు ప ర్యటించబోతున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఖమ్మం, భద్రాద్రి ఉమ్మడి జిల్లాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ స్వయంగా పరిశీలన చేయడంతోపాటు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. రెండు జిల్లాలో సింగరేణి బొగ్గు గనులతో



పాటు విస్తారంగా ఉన్న అడవులు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాయు, జలకాలుష్యం తదితర అంశాలపై కమిటీ స్వయంగా పరిశీలించనుంది. ఆయా పరిశ్రమలను ప్రత్యక్షంగా తిలకించి సమావేశాలు నిర్వహించి కేంద్రానికి నివేదిక సమర్పించనుంది. 27న హైదరాబాద్ నుంచి ఖమ్మం చేరుకుని అర్బన్ మండల పరిధిలోని వెలుగుమట్ల అటవీశాఖ పార్కును పరిశీలిం చ నున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో రైతులను కలుసుకోనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్‌లో గనులను సందర్శించి అధికారులతో సమావేశం కానున్నారు. పాల్వంచలోని కేటీపీఎస్‌ను సందర్శించి పర్యావరణంపై చర్చించనున్నారు. అనంతరం భద్రాద్రి ఐటీసీ పేపర్‌బోర్డుకు చేరుకుని రాత్రి బస అనంతరం 28వ తేదీ ఉదయం భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించనున్నారు. ఆ తర్వాత మణుగూరు హెవీవాటర్ ప్రాజెక్టును సందర్శించి అక్కడ అదికారులతో కమిటీ చర్చిస్తారు. అదేరోజు సాయంత్రం సారపాకలోని ఐటీసీ బీపీఎల్ కర్మాగారాన్ని సందర్శించి 28న రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారు.

రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మధిర టౌన్: రజకుల సంక్షేమానికి గతంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధిశాఖ చైర్మన్ బుడాన్‌బేగ్, రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరి సత్యానారాయణ అన్నారు. బుధవారం మధిరలోని సాయిబాబా కళ్యాణ మండపంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రజకుల అవగాహన సదస్సు జిల్లా అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో వారు మాట్లాడారు. రజకుల సంక్షేమానికి కేసీఆర్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.250కోట్ల నిధులు మంజూరు చేసి 31 జిల్లాల్లో యూనిట్లకు రుణం అందించేందుకు కృషిచేస్తోందని పేర్కొన్నారు. నిరుద్యోగ రజక యువకులకు రుణాలిచ్చి వృత్తినైపుణ్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ నాగరాణి, టీఆర్ఎస్ నాయకుడు లింగాల కమలరాజు, రజక సంఘం రాష్ట్ర కోకన్వీనర్ చల్లా వీరేశం, శ్రీనివాస్, తలుపుల వెంకటేశ్వర్లు, తమ్మారపు బ్రహ్మయ్య, తిరుమలగిరి రాధాకృష్ణ, మంకెన కృష్ణ, నిమ్మటూరి రామకృష్ణ, నర్సింహారావు, సాయిబాబా, అల్లూరి కృష్ణ, విజయబాబు, తిరుమల, పద్మ, మల్లెల సత్యనారాయణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బేగ్

సెప్టెంబరు 20నుంచి అక్టోబరు 4 వరకు
దసరా సెలవులు
అక్టోబర్ 9నుంచి ఎస్ఎ- 1పరీక్షలు

కొత్తగూడెం అర్బన్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెప్టెంబరు 20వ తేదీ నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు దసరా సెలవులను విద్యాశాఖ ప్రకటించింది. దసరా సెలవుల అనంతరం సమ్మేటీవ్ (ఎస్ఎ-1) -1 పరీక్షలు నిర్వహించనున్నారు. సంక్రాంతి సెలవులు జనవరి 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రకటించింది. ఎఫ్ఎ-2 పరీక్షలు సెప్టెంబరు 19వ తేదీ లోగా, ఎఫ్ఎ-3 పరీక్షలు నవంబరు 20వ తేదీలోగా, ఎఫ్ఎ-4 పరీక్షలు 31జనవరి 2018లోగా నిర్వహించాలని ఆదేశించింది. ఎస్ఎ-2 పరీక్షలు మార్చి 7వ తేదీ (2018) నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు 2018 ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వర కు నిర్వహిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జూలై, ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, జనవరి ఫిబ్రవరి (2018) నెలల్లో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. వేసవి సెలవులు 2018 ఏప్రిల్ 12నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉంటాయి. గతంలో జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రా రంభం అయ్యేవి. అయితే జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 1వ తేదీనే పాఠశాలలు తెరుస్తారు. ప్రతి ఏడాది మార్చి 23వ తేదీ లోగా సిలబస్‌పూర్తి చేయాలి. ఈ సారి జూన్ 1వ తేదీనే పాఠశాలలు పున: ప్రారంభమవుతాయి.

సూక్తి

సేవను మించిన ఆనందం లేదు
సంతోషాన్ని మించిన సంపద లేదు

టంగ్ ట్విస్టర్స్

1. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
2. Chester Cheetah chews a chunk of cheep cheddar cheese.
3. Real rock wall, real rock wall, real rock wall
4. A gazillion gigantic grapes gushed gradually giving gophers gooey guts.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏ రోజు పని ఆ రోజే చేయడం ఉత్తముల లక్షణం. అర్థమైందా?

బంటు : అర్థమైంది టీచర్. రేపటి హోంవర్క్ రేపే చేయాలి. ఈ రోజు కాదు!

టీచర్ : !!!!!!!!

ఓటమే లేకుండా..



ఏ ఆటలోనైనా గెలుపు-ఓటములు తప్పవు. కానీ కెరీర్ మొదలుపెట్టిన నాటి నుంచి ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా విజయాలు సాధించడం మామూలు విషయం కాదు. పుణేకు చెందిన జూనియర్ గోల్ఫర్ ఆర్యమన్ సింగ్ అదే చేసి చూపించాడు . నాలుగేళ్లుగా విజయాలే సాధిస్తూ దూసుకుపోతున్నాడు. 'ఇండియన్ గోల్ఫ్ యూనియన్- వెస్ట్ జోన్' అందించే 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను వరుసగా మూడు సార్లు సాధించాడు. జోనల్ లెవల్‌లోనూ, జాతీయ స్థాయిలోనూ ఈ జూనియర్ గోల్ఫర్‌కు తిరుగులేదు. జూనియర్ గోల్ఫ్ చరిత్రలో 1,266 రోజులుగా ఓటమి ఎరుగని అజేయుడిగా నిలిచి సరికొత్త రికార్డు సాధించాడు.

ఆర్యమన్ సింగ్ వయసు పదేళ్లు. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా గోల్ఫ్ ఆడటం మొదలెట్టి నాలుగేళ్లు అవుతోంది. జోనల్ లెవల్‌లో ఇంతవరకు ఆర్యమన్‌కు తిరుగులేదు. ఈ ఛోటా గోల్ఫర్ తన కెరీర్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడాచేజార్చుకోలేదు. 1,266 రోజులుగా తన విజయ యాత్ర కొనసాగిస్తూ జూనియర్ లెవల్ గోల్ఫ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

'నా నాలుగో ఏట నుంచి గోల్ఫ్ ఆడటం మొదలుపెట్టాను. రెండు సంవత్సరాల పాటు గోల్ఫ్ సాధన చేశాను. ఆట గురించే ఎప్పుడూ ఆలోచించేవాడిని. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయుల్లో జరిగే ప్రతి గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గొనేవాడిని. అహ్మదాబాద్‌లోని 'కెన్స్‌విల్లే గోల్ఫ్ కోర్సు'లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారిగా విజయం సాధించాను. ఆనాటి నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వస్తున్నాను. మూడేళ్లుగా 'జస్టిన్ పార్కన్స్' నాకు కోచింగ్ ఇస్తున్నాడు. గోల్ఫ్ క్రీడలో పేరుగాంచిన మార్క్ రోయ్, డేవిడ్ స్టాక్టన్, విజయ్ దివెచ వంటి దిగ్గజాల దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. నేనింకా గోల్ఫ్ నేర్చుకునే దశలోనే ఉన్నాను. భవిష్యత్తులో ఈ క్రీడలో మరింత రాణించాలని అనుకుంటున్నాను. నాకు గోల్ఫ్‌తో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలంటే కూడా ఎంతో ఇష్టం. సమయం చిక్కితే అవి కూడా ఆడుతుంటాను. టీవీ చూస్తాను. స్కూల్‌వర్క్ కంప్లీట్ చేసుకున్న తర్వాతే ఆటలు ఆడతాను'

- ఆర్యమన్



ఔనా!

ఉడుము ఊపిరి తీసుకోకుండా నీటిలో అరగంట పాటు ఉండగలదు.



చుక్కలు కలపండి



మీకు తెలుసా?




58 శాతం మంది మహిళలు ప్రతిరోజూ నెయిల్ పాలిష్ వేసుకుంటారని ఓ అధ్యయనంలో తేలింది.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. KJOE ▸ ....
2. HAET ▸ ....
3. THBA ▸ ....
4. RSHU ▸ ....

చెప్పగలరా?

నాడిలో ఉన్నా కానీ కోడిలో లేను
జూలులో ఉన్నా కానీ జూన్‌లో లేను
గుడిలో ఉన్నా కానీ బడిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి



జవాబులు

చెప్పగలరా? : నాలుగు
జంబ్లింగ్ వర్డ్స్ :
1. JOKE 2. HATE/HEAT 3. BATH 4. RUSH

గంజాయి..నల్లబెల్లం.. సారా..

●ఈకోణంలోనే పోలీస్, ఎక్సైజ్ వెతుకులాట

కొత్తగూడెం క్రైం: జిల్లాలో మాదక ద్రవ్యాలు లేవు. అసలు వాటి వినియోగమే జరగడం లేదు. ఈ మాట అంటోంది సాక్షాత్తూ ఎక్సైజ్, పోలీస్ శాఖాధికారులు. కానీ మానసిక వైద్యులు, పేరొందిన డాక్టర్లు చెబుతున్న విషయాలు ఒళ్లు గగుర్పొడుస్తున్నాయి. మత్తు పదార్థాలను జిల్లా యువత భారీగానే వినియోగిస్తోంది. కొకైన్ లాంటి తెల్ల పౌడర్, వైట్నర్‌ను మత్తు కోసం వాడుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవల చికిత్స కోసం వచ్చిన కొంత మంది యువత తమ కౌన్సెలింగ్‌లో ఇలాంటి విషయాలనే చెప్పారని, అసలు తాము వాడుతున్నది ఏంటో తెలియదని మత్తు మాత్రం బాగా ఉంటోందని వైద్యులతో పేర్కొంటుండటం నివ్వెరపరుస్తోంది.

గుర్తించగలరా?

మత్తు పదార్థాల తయారే కాదు వినియోగం కూడా ఆధునిక రూపు సంతరించుకుంటోంది. కొకైన్, ఎల్ఎస్‌డీ వంటి డ్రగ్స్‌ను కోడింగ్ రూపంలో సరఫరా చేస్తున్నారు. ఇటీవల వాటిని కార్టూన్స్ రూపంలో కూడా పంపిస్తున్నారు. దేశంలో నిషేధం ఉండటంతో విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. పోలీసు, ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో ఇవి దొరికినా అవి డ్రగ్సేనని గుర్తించగలరా? అంత సామర్థ్యం వీరికుందా? అంటే లేదనే సమాధానం ఆ శాఖ సిబ్బంది నుంచి వస్తోంది. ఇటీవలి కాలంలో జిల్లా నుంచి పెక్కు సంఖ్యలో యువత ఖమ్మంలోని మానసిక వైద్యుల వద్దకు వెళ్లారు. వారంతా డ్రగ్స్ బాధితులే. జిల్లాలో పేరొందిన మానసిక వైద్యులు లేకపోవడంతో వారు అక్కడికి వెళ్తున్నారు.

వైద్యులు చెప్పిన వివరాల ప్రకారం..

ఖమ్మంలో పేరొందిన ఓ మానసిక వైద్యులను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించింది. వారు చెప్పిన వివరాల ప్రకారం.. జిల్లాలోనూ మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగానే ఉన్నట్టు తెలియవచ్చింది. ముఖ్యంగా పారిశ్రామిక వాడల్లో ఉండే యువత వైట్నర్, వైట్ పౌడర్‌కు బాగా అలవాటు పడ్డారని వెల్లడైంది. జిల్లా నుంచి గడిచిన జూలై, ప్రస్తుత ఆగస్టులో ఇప్పటి వరకూ 90 మంది యువకులు ఖమ్మంలోని మానసిక వైద్యులను సంప్రదించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వీరంతా 25 నుంచి 30 ఏళ్లలోపు వారు కావడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. పైగా వీరు మత్తులో కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. ఇప్పటి వరకు మత్తు కలిగించే ఔషధాలనూ వీరు విడిచిపెట్టడం లేదు. ఏ రూపంలో మత్తు దొరికినా వీరు వదలడం లేదు. కొందరికయితే గంటలపాటు కౌన్సెలింగ్ ఇవ్వాల్సి వస్తోందని.. వారు చెబుతున్న విషయాలు నివ్వెరపరుస్తున్నాయని మానసిక వైద్యులు 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు.

అడ్డూఅదుపేదీ?

వైట్నర్, దీర్ఘకాలిక రోగాల నివారణకు వాడే టానిక్‌లు(కోరెక్స్), నిద్రమాత్రల్లో మోతాదులో మత్తు కలిగించే పదార్థాలుంటాయి. ఆయా రోగుల పరిస్థితి ఆధారంగా ఈ మందులను వైద్యులు రాస్తారు. వీటిని ప్రిస్కిప్షన్ ఉంటేనే ఇవ్వాల్సి ఉంటుంది. ఇవ్వేం పట్టని మెడికల్‌షాపుల నిర్వాహకులు ఎటువంటి ప్రిస్కిప్షన్ లేకుండానే కాసులకు కక్కుర్తి పడి అమ్మేస్తున్నారు. వీటిని మోతాదుకు మించి తీసుకుని యువత మత్తులో జోగుతున్నారు. మెడికల్‌షాపులపై అధికారులు దాడులు నిర్వహించకోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

గంజాయితోనే సరి..

రాష్ట్రంలో డ్రగ్స్ కేసు సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే జిల్లాలో కొందరు మత్తుపదార్థాలను విక్రయిస్తున్నారని, వినియోగిస్తున్నారని పోలీసుల వద్ద సమాచారం ఉంది. అయినప్పటికీ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు వాటి మూలాలను వెతికే ప్రయత్నం చేయడం లేదు. జిల్లా ఏజెన్సీ ప్రాంతం కనుక గంజాయి ఎక్కువగా ఉంటుందని, ఆ కోణంలోనే తనిఖీలు చేస్తున్నారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో మత్తు పదార్థాల విక్రయం చాపకింద నీరులా సాగుతున్నా ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. కొందరు మహిళలే డ్రగ్స్ అమ్ముతున్నా వారిపై చర్యలు లేవు. పైగా వారు కొందరు 'పోలీసులతో'టచ్‌లో ఉంటున్నారని తెలుస్తోంది. అసలు అనుమానితులను ఎలా పట్టుకోవాలి? ఎలా ప్రశ్నించాలి? ఈ విషయాలపై అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. దీనిపై పోలీసులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరితే టాస్క్‌ఫోర్స్ బృందాలు చూసుకుంటాయని సమాధానం చెప్పడం విస్మయానికి గురి చేస్తోంది.

'కోల్' నాగుల్లో కలకలం!

●సంచలనం సృష్టించిన 'ఆంధ్రజ్యోతి' కథనం

●తవ్వినకొద్దీ వెలుగులోకి వస్తున్న మాఫియా ఆగడాలు

●నాలుగు శాతం ఇచ్చుకోలేక లారీలనే అమ్మేసిన యజమానులు

●దందాను అరికట్టాలని విజ్ఞప్తి



'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఆసక్తిగా చదువుతున్న ఓనర్లు, గుమస్తాలు, డ్రైవర్లు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో జరుగుతున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ దందాపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'కోల్' నాగులు కథనం సంచలనం రేపింది. ఎక్కడ చూసినా 'కోల్' నాగులు వార్తా కథనం పైనే చర్చలు జరగడం గమనార్హం బొగ్గు రవాణా చేసే డిబ్లాక్ ఏరియాలో లారీ యజమానులు, డ్రైవర్లు, బ్రోకర్లు, గుమస్తాలు, అసోసియేషన్ నాయకులు, రింగ్ లీడర్లు 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఆసక్తిగా చదవడం కనిపించింది. అయితే కోల్‌ట్రాన్స్ పోర్ట్ మాఫియా ఆగడాలపై, దందాలపై మరికొందరు లారీల యజమానులు స్పందించారు. 'ఆంధ్రజ్యోతి' కథనం అక్షరసత్యమని పేర్కొన్నారు.

కోల్‌ట్రాన్స్‌పోర్టు లీలలు ఎన్నెనో

ఇల్లెందు, కోయగూడెం ఏరియాల్లో కోల్‌ట్రాన్స్‌పోర్ట్ జరుగుతుంటుంది. ఈ రెండు ప్రాంతాల్లో 15 ఏళ్లుగా కోల్ మాఫియా గుప్పిట్లో లారీల యజమానులు తీవ్రంగా నలిగిపోయారు. వరదలా వస్తున్న కరెన్సీ కట్టలు చూసిన అసోసియేషన్‌లోని కొందరు రెండు వర్గాలుగా చీలారు. గతంలో పరస్పరం దాడులు సైతం చేసుకున్నారు. కోయగూడెం ఓసీలో కోల్‌ట్రాన్స్‌పోర్ట్‌లో గతంలో తనను బెదిరించి గుమస్తాలు, బ్రోకర్ల మామూళ్ల పేరిట దౌర్జన్యంగా నాలుగు శాతం కిరాయిలు మినహించుకుంటున్నారని, దాడి చేసి కొట్టారంటూ ఎండీ. ఖాదరుద్దీన్ అనే లారీ యజమాని ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్న ప్రతాప్‌రెడ్డి, యాకూబ్‌షావలీ, పాష, ప్రమోద్, హఫీజ్, జ్ఞానేశ్వర్, పూర్ణ, దినేష్ అనేవారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్ 420, 384, 506 రెడ్‌విత్ 34ఐపీసీ ద్వారా ఎఫ్ఐఆర్ నెం. 134/15తో కేసు నమోదుచేయడం గమనార్హం. ఇరువర్గాలుగా చీలిన సభ్యులైన లారీయజమానులు ఇల్లెందులో కర్రలతో కొట్టుకున్నారు. ఓదళకమాండర్ పంచాయితీ కూడా చేసినట్టు సమాచారం. ట్రాన్స్‌పోర్ట్ దందా ఘటనపై పోలీసులు పలు కేసులు కూడా నమోదు చేశారు. కొద్ది నెలల క్రితం బయ్యారం మండలానికి చెందిన లారీలకు కోల్‌ట్రాన్స్‌పోర్ట్ లోడ్‌లు ఇవ్వకుండా కోయగూడెంలో ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అడ్డుపడింది.ఈ వివాదం తీవ్రస్థాయికి చేరి ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా వెళ్లింది. తదనంతరం కోయగూడెం ఓసీ ట్రాన్స్‌పోర్ట్‌లో సభ్యత్వాల పేరిట డబ్బు దండుకోవడంలాంటి చర్యలు నిలిచిపోవడం గమనార్హం. ఇల్లెందులో ఈ ఆగడాలుకొనసాగుతూనే ఉన్నాయి.

ఎవరికీ చెప్పుకోలేక... కుమిలిపోతూ..

జీవనోపాధి కోసం ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు చేసి లారీలు కొనుగోలు చేసి కోల్‌ట్రాన్స్‌పోర్ట్‌లో పెట్టుకున్న లారీల యజమానులు కక్కలేక మింగలేక నరకయాతన అనుభవిస్తుండటం గమనార్హం. కోల్‌ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్‌ను కోల్‌బెల్ట్‌ను కంటిచూపుతో శాసిస్తున్న స్థానికేతరుడైన వ్యక్తి ప్రభావం తీవ్రస్థాయిలో ఉండటంతో భీతిల్లుతున్న లారీల యజమానులు ఫైనాన్స్ సంస్థల వాయిదాలు సకాలంలో చెల్లించలేక వాహనాలను అమ్ముకున్నారు. ఏకంగా తమకు పోలీసులు, నక్సల్స్, అధికార పార్టీకి చెందిన ఒక స్థానికేతర ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నాయంటూ మాఫియా చెబుతుండటంతో లారీల యజమానులు తమ కిరాయిలనుంచి నాలుగుశాతం డబ్బును మరు మాట్లడకుండా ముట్టజెబుతున్నారు.

మూడు లారీల నుంచి ఒక్కలారీకి

● ఎస్‌కే.సంధాని, లారీ యజమాని

ఇల్లెందు కోల్ ట్రాన్స్‌పోర్ట్‌లో ఆంధ్రా పెత్తందారి,నిరంకుశత్వంతో తీవ్రంగా నష్టపోయాను. 2002లో నాకు మూడు లారీలు ఉండేవి. కోల్ మాఫియా ముఠాల దందాలు, సమ్మెలు, వివాదాలతో కిరాయిలు సక్రమంగా రాక అప్పుల ఊబిలో కూరుకుపోయా కిస్తీలు చెల్లించక ఫైనాన్స్ సంస్థలు రెండు లారీలు తీసుకెళ్లాయి. ఫలితంగా నేడు ఒక్క లారీ మిగిలింది.

అనేక ఏళ్లుగా దందా

● వల్లూరి రామారావు, ఇల్లెందు లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్



ఇల్లెందులో బొగ్గు పుట్టినప్పటి నుంచి ఇచ్చిపుచ్చుకోవడాలు జరుగుతూనే ఉన్నాయి. మేము లారీ ఓనర్ల సంక్షేమం కోసం పనిచేస్తున్నాం. పెట్టుబడిగా నాలుగు శాతం వసూలు చేయడం నిజమే. లారీ ఓనర్లకు ఉత్పన్నమవుతున్న అనేక సమస్యలను వివిధ వర్గాల వారిని ఎంతో కాలంగా అసోసియేషన్ నేతగా ప్రతాప్‌రెడ్డి సమన్వయం చేస్తూ ట్రాన్స్‌పోర్ట్ నడిపిస్తున్నారు.


పునరా'మోసం'!

●క్వింటాళ్ల కొద్దీ సరుకులు కొనుగోలు చేసిన ఎక్సైజ్ అధికారులు

దుమ్ముగూడెం: గుడుంబా పునారావసం పొందే వారిలో ఎక్కువశాతం మారుమూల పల్లెలకు చెందిన వారే. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో కిరాణా దుకాణాలున్నాయి. అక్కడ విక్రయించేందుకు వీలులేని సరుకులను పెద్దసంఖ్యలో కొనిపించారు. క్వింటాళ్ల కొద్దీ మైదా, గోధుమ, శనగపిండిని అంటగట్టారు. వీటిని ఎలా అమ్మాలో తెలియక, పురుగు పడుతుందనే కారణంగా తక్కువ ధరకైనా ఇతర దుకాణాలకు తెగనమ్మి వదిలించుకుంటున్నారు. గౌరారానికి చెందిన లబ్ధిదారురాలికి 30 బస్తాల ఉప్పుతోపాటు పచ్చడి బాక్సులను, ఫ్యాన్సీ సామాన్లను అవసరం లేకున్నా అంటకట్టారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గిరిజన గ్రామంలో అంతగా తెలియని సజ్జలను కూడా అంటగట్టి చేతులు దులుపుకోవడం గమనార్హం. లబ్ధిదారుడి ప్రాంతంలో చెల్లుబాటయ్యే సరుకుల కొనుగోళ్లు పక్కనబెట్టి.....కేవలం రూ. రెండు లక్షల యూనిట్‌కు సరిపడా కొనిపెట్టడమే లక్ష్యం వెనుక కమీషన్లు పెద్ద ఎత్తున చేతులు మారాయని తెలుస్తోంది.

అందరికీ చేతిరాత బిల్లులే

యూనిటు మంజూరైన లబ్ధిదారులందరికీ చేతిరాత బిల్లులతో సరిపెట్టారు.మరి కొందరి వద్ద జిరాక్స్ తీయించి ఇస్తామని తిరిగి ఇవ్వకపోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం ప్రభుత్వ అనుమతి పొందిన బిల్లులను లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉంది. కొటేషన్లకు, కొనుగోలు బిల్లులకు అసలు పొంతనే లేదని సమాచారం. కొనుగోలు చేసిన నాటి హోల్‌సేల్ ధరలను పరిశీలిస్తే సరుకు ఆధారంగా ఒక్కో రకానికి రూ.100 నుంచి రూ. నాలుగు వేల వరకు అధికంగా బిల్లు చేసినట్టు తెలుస్తోంది. దీంతో ఒక్కో కిరాణా యూనిట్‌లో రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ధరల్లో అధిక వ్యత్యాసమున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక లబ్ధిదారురాలికి విక్రయించిన సరుకుల బిల్లు కూడికల్లో సైతం రూ.6000ల తేడా రాగా....ఆమె రెండోదఫా బండారుగూడెం దుకాణానికి వెళ్లి కావాల్సిన సరుకులను తెచ్చుకోవడం గమనార్హం. మరి కొందరు కిరాణా లబ్ధిదారులకు సరుకులతో సహా కాటా, తూకం రాళ్లు, రిఫ్రిజిరేటర్ కొనిస్తామని నగదును మినహాయించారు. అయితే నేటికీ అవి లబ్ధిదారులకు చేరలేదు. కొందరు లబ్ధిదారులకు రిఫ్రిజిరేటర్ కొనుగోలు చేసి ఇవ్వగా, మరి కొందరు కావాలని అడిగినా ఇవ్వలేదు. కొనుగోలులో మార్గదర్శకాలు లేక పోవడంతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారు.



లబ్ధిదారులకు ఇచ్చినట్టు కాగితంపై సరుకుల వివరాలు

గ్రామస్థుల సమక్షంలో..

సమగ్ర విచారణ జరిపించాలి

● విలేకరుల సమావేశంలో బాధిత కుటుంబం

ములకలపల్లి: తప్పుడు కేసులు పెట్టి తమపై దుష్ప్రచారం చేసిన ములకలపల్లి ఎస్ఐ రాంచరణ్‌పై చర్యలు చేపట్టి స్థానికంగా తిరిగి సమగ్ర విచారణ చేపట్టాలని పొగళ్లపల్లికి చెందిన ఐతం సోని డిమాండ్ చేశారు. బుధవారం ములకలపల్లిలో విలేకరుల సమావేశంలో బాధిత మహిళ సోని తన భర్త శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. 2016 అక్టోబర్ 20న తన ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా అర్ధరాత్రి వేళ గ్రామానికి చెందిన గోళ్లముడి బాలకృష్ణ ఇంట్లోకి చొరబడి దొంగతనానికి ప్రయత్నించాడు. దీంతో ఇదే విషయమై మరుసటి రోజు భర్త శ్రీనివాస్‌తో కలిసి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. కానీ అప్పటి ఎస్ఐ రాం చరణ్ తన ఫిర్యాదును వక్రీకరించి దానిని బలవంతపు కేసుగా మార్చి నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా సదరు దొంగతో తనకు వివాహేతర సంబంధం ఉందంటూ ప్రచారం చేశారని ఆమె వాపోయింది. దీంతో తాము ఆ నిందను భరించలేక తొమ్మిది నెలలుగా సొంత ఊరుకు దూరమయ్యారన్నారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు కలిసి గోడు వెళ్లబుచ్చుకున్నామని తెలిపారు. అయినా న్యాయం జరగలేదన్నారు. కేసును విచారించిన అధికారులు కేవలం ఎస్ఐను సరండర్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పటికైనా పోలీసుశాఖ ఉన్నతాధికారులు కల్పించుకుని గ్రామస్థుల సమక్షంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించడంతోపాటు సదరు ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని సమష్టి కృషితో సాధించాలి

డైరెక్టర్ ఆపరేషన్స్ చంద్రశేఖర్



21 ఇంక్లైన్‌ను సందర్శించిన డైరెక్టర్ చంద్రశేఖర్

ఇల్లెందుటౌన్: సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సమష్టి కృషితో సాధించాలని సింగరేణి డైరెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఇల్లెందు ఏరియాలోని 21ఇంక్లైన్, కేవోసీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లెందు ఏరియాకు నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని రక్షణ సూత్రాలను పాటిస్తూ సాధించాలన్నారు. యాజమాన్యం అనేక కార్మిక సంక్షేమ చర్యలకు పూనుకుంటుందని వెల్లడించారు. ఇల్లెందు ఏరియా మనుగడ కోసం కృషిచేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా మూడు కొత్తమైన్‌లను త్వరలోనే తీసుకురానున్నట్లు ప్రకటించారు. కోయగూడెం ఓసీలో సెప్టెంబర్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఏరియ జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ, ఏజెంట్ బీ.వెంకటేశ్వర్లు, కేవోసీ పీవో వేణుగోపాల్, 21ఇంక్లైన్ మేనేజర్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'క్రెడిట్ సొసైటీలో అధికారుల నుంచి రికవరీ చేయాలి'

ఇల్లెందుటౌన్: సింగరేణి 21ఇంక్లైన్ క్రెడిట్ సొసైటీలో జరిగిన అవకతవకల్లో అవినీతికి పాల్పడిన అధికారులతోపాటు డైరెక్టర్లు, ఉద్యోగుల నుంచి రికవరీచేయాలని జిల్లా క్రెడిట్ సొసైటీ అధికారి ఆదేశాలు పంపినప్పటికీ రికవరీ చేయడంలేదని హెచ్ఎంఎస్ ఇల్లెందు డివిజన్ ఉపాధ్యక్షులు గోచికొండ సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం జీఎం కందుకూరి లక్ష్మీనారాయణకు ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రెడిట్ సొసైటీలో అవినీతికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైన అధికారుల నుంచి, సిబ్బంది నుంచి ఎంతెంత రికవరీ చేశారో ఉన్నతాధికారులు వెంటనే బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. సొసైటీలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా అవినీతికి అధికారులు గుర్తించారని వెల్లడించారు.

నేడు హైదరాబాద్‌లో కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర సదస్సు

ఇల్లెందుటౌన్: బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీం కోర్టు తీర్పుకనుగుణంగా వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జే. సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

నమ్మిన కార్మికులను నట్టేటముంచారు

- ఐఎన్‌టీయూసీ సెంట్రల్ నాయకులు త్యాగరాజు విమర్శ



మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు త్యాగరాజు

ఇల్లెందుటౌన్: సింగరేణి కార్మికులు గత ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను నమ్మి ఓట్లువేసి గెలిపిస్తే నట్టేట ముంచారని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ నాయకుడు త్యాగరాజు ఆరోపించారు. బుధవారం ఇల్లెందు ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు సంవత్సరాల కాలంపాటు గుర్తింపు సంఘంకార్మికులను అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ట్రేడ్ యూనియన్ అంటేతెలియని నేతలను గెలిపిస్తే కార్మికులకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. డబ్బుల పంపకాలపైనే దృష్టిసారించారని విమర్శించారు. సింగరేణిలో అనేక హక్కులు సాధించిన ఘనత జాతీయ సంఘాలకే ఉందన్నారు. ఐఎన్‌టీయూసీ సంఘంతో అనేక హక్కులు తీసుకువచ్చినట్లు తెలిపారు. 1974 నుంచి వేజ్‌బోర్డ్ సంఘంగా ఐఎన్‌టీయూసీ ఉంటుందన్నారు. అసలైన యూనియన్ తమదేనని త్వరలోనే డిప్యూటి చీఫ్ లేబర్ కమిషనర్ నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. వేజ్‌బోర్డ్‌లో తమ యూనియన్‌ను లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వంద్వవైఖరి అవలంబిస్తుందని ఆరోపించారు. కోర్టు ఆదేశాలు లేకపోయినప్పటికీ వేజ్‌బోర్డ్ చర్చలకు ఆహ్వానించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఎంఎస్ అవలంబిస్తున్న విధానాల మూలంగానే వేజ్‌బోర్డ్ వాయిదాలు పడుతుందన్నారు. సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ కలిసిపనిచేసేందుకు జాతీయ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఇల్లెందు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఎస్‌డీ. మహబూబ్, సెంట్రల్ ఉపాధ్యక్షుడు కొండూరు చిన్న, నందకిషోర్, జైపాల్‌రెడ్డి, జానాప్రసాద్, రాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జానీ పాల్గొన్నారు.

కార్మికులకు 30శాతం బోనస్ ప్రకటించాలి

జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథ్

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: సింగరేణి లాభాల్లో కార్మికులకు తక్షణమే 30శాతం బోనస్ ప్రకటించాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఇఫ్టూ కార్యాలయంలో జీఎల్‌బీకేఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు 30శాతం బోనస్ ప్రకటించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రేడ్‌యూనియన్లతో ఐదుసార్లు చర్చలు జరిపినప్పటికీ కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను సవరించకుండా సింగరేణిలో ఎన్నికలకు పోవడం అప్రజాస్వామికం అన్నారు. పెరుగుతున్న ఖర్చులు, జీత భత్యాల ఆధారంగా 100శాతం న్యూట్రలైజేషన్ ఇవ్వాలని, కనీసం 30శాతం తగ్గకుండా అగ్రిమెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్టులు రద్దుచేసి అండర్‌గ్రౌండ్ బావులను ఏర్పాటుచేయాలన్నారు. వారసత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ మెడికల్ బోర్డు ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. గెలిచిన యూనియన్‌తో అగ్రిమెంట్ చేసుకున్నప్పటికీ ప్రతీట్రేడ్ యూనియన్‌కు గేట్ మీటింగ్‌లు, సభ్యత్వం, పోస్టర్లు, కరపత్రాలు పంచుకునే హక్కును సింగరేణి యాజమాన్యం కాలరాయవద్దని అది కార్మికుల హక్కు అని ఆయన స్పష్టంచేశారు. ఈ సమావేశంలో జీఎల్‌బీకేఎస్ రీజియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.విశ్వనాథం, ఆసంఘం రీజియన్ నాయకులు రామటెంకి అశోక్, డివిజన్ నాయకులు కాపు కృష్ణ, జి.సంజీవరావు, ఎం.చంద్రయ్య, సుబ్బరాజు, నర్సింహారాములు, ఎండి.అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గంలో ఆరుగురికి స్థానం

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: రామగుండంలో ఈ నెల 21, 22తేదీల్లో రెండు రోజులు జరిగిన సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) 14వ రాష్ట్ర మహాసభలో కొత్తగూడెం నుంచి ఆరుగురిని రాష్ట్ర కార్యవర్గంలోకి ఎన్నుకున్నారని బ్రాంచీ కార్యదర్శి పప్పుల వెంకటి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం యూనియన్‌లో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉన్న టి. రాజారెడ్డి, మందా నర్సింహారావు ఆ బాధ్యతలోకి తిరిగి ఎన్నికయ్యారు. రాష్ట్ర కోశాధికారిగా జి. రాజారావు, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా విజయగిరి శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎలగొండ రఘు, కర్ల వీరస్వామి, కల్చరల్ కార్యదర్శిగా కె.సమ్మయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే. రమేష్‌బాబు, రాష్ట్ర కార్యవర్గంలోకి కొత్తగూడెం నుంచి ఎన్నికయ్యారు. కొత్తగూడెం బ్రాంచీనుంచి వై.వెంకటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు, కట్టా నర్సింహారావు, టి.నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మహాసభలో ప్రతినిధులు తమపై ఉంచిన కర్తవ్యాలను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని వారు తెలిపారు. కొత్తగూడెం బ్రాంచీ నాయ కులు పలువురు ఈ సందర్భంగా వీరిని అభినందించారు.

327 యూనియన్ ఎన్నికల ప్రచారం షురూ..



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

పాల్వంచ టౌన్: విద్యుత్ రంగ సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 8వ తేదీన జరగనున్న నేపథ్యంలో విద్యుత్ కార్మికసంఘం 327 యూనియన్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఐఎన్‌టీయూసీ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాధం రామకృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వాల్‌పోస్టర్లను యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌వీకేఎస్ నాయకులు బొల్లెపల్లి రాంబాబు, కట్ట శ్రీధర్, ఏఐటీయూసీ నాయకులు వి.దుర్గఅశోక్, సల్లం పరమేష్, 327 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. మజీద్, కే. రవికుమార్, ఆర్.అప్పారావు, పాశం రవిబాబు, బి. రామారావు, బి. సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేవోసీలో ఫిట్-1 పనులను పరిశీలించిన సింగరేణి డైరెక్టర్



ఫిట్-1 పనులను పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్)చంద్రశేఖర్

టేకులపల్లి: కేవోసీలో జరుగుతున్న ఫిట్-1 పనులను సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్) చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఫిట్-1లో నిర్మిస్తున్న ఫ్రీవేబిన్‌బ్రిడ్జి పనులను పరిశీలించారు. సెప్టెంబర్ మాసం వరకు పనులు పూర్తిచేయాలని నిర్ధేశించారు. అనంతరం ఫిట్-1 క్వారీని పరిశీలించారు. ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించేందుకు నిర్ణీత సమయంలో ఓబీతీయాలని ఓబీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రక్షణతో కూడిన పనులు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఏరియా జీఎం లక్ష్మీనారాయణ, కేవోసీ పీవో వేణుగోపాల్, మేనేజర్ క్రిష్ణయ్య, పీఈ రమేష్‌లు పాల్గొన్నారు.

కార్మికులను మోసగిస్తున్న సింగరేణి యాజమాన్యం

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి శేషయ్య

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: 2016-17 సంవత్సరానికి నిర్దేశించిన 62మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినప్పటికీ రూ.395.38కోట్లు మాత్రమే లాభాలను చూపడం సింగరేణి యాజమాన్యం కార్మికులను మోసం చేయడమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి దమ్మాలపాటి శేషయ్య, కార్పోరేట్ కార్యదర్శి వంగా వెంకట్ ఆరోపించారు. బుధవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని బావులు, డిపార్ట్‌మెంట్ల వద్ద జరిగిన ధర్నాలలో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 ఇంక్లైన్, వీకే-7 ఇంక్లైన్, జీకేఓసీ, ఆర్‌సీహెచ్‌పీ, ఇతర డిపార్ట్‌మెంట్లలో జరిగిన ధర్నాలో పాల్గొన్న నాయకులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సకల జనుల సమ్మె ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన సింగరేణి కార్మికుల బంగారు తెలంగాణ ఆశలు అడియాశలయ్యాయని, అహర్నిశలు శ్రమించి తమ రక్తాన్ని చెమటగా మార్చి గత18 ఏళ్లుగా ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ లాభాల బాటలో నడిపిస్తున్న కార్మికుల త్యాగాలను గుర్తించకపోవడం విచారకరమన్నారు. గత 2015-16 సంవత్సరానికి 60మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి ద్వారా రూ.1,066.13 కోట్లు నికర లాభాలను ఆర్జిస్తే కార్మికులను స్పెషల్ ఇన్సెంటీవ్ రూపంలో 23శాతం అనగా 245.20కోట్లను చెల్లించిందని వారు గుర్తుచేశారు. ఈ ఏడాది సాధించిన 62 మిలియన్ టన్నుల బొగ్గుఉత్పత్తిపై కేవలం రూ. 395.38కోట్లు మాత్రమే లాభాలుగా చూపి మసిబూసి మారేడు కాయచేశారని ఆరోపించారు. వాస్తవిక లాభాలు పారదర్శ కంగా ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. సింగరేణిలో తప్పుడు లెక్కలను చూపించడం సరైన చర్యకాదని విమర్శించారు. మరో పర్యాయం పారదర్శకం గా లాభాలను లెక్కించి, వాటిపై 30శాతం స్పెషల్ ఇన్సెంటీవ్ చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు ఎం. అప్పారావు, కే.రాజయ్య, జి. వీరస్వామి, కె. రాములు, ఎస్.నాగేశ్వరరావు, బోయపాటి నాగేశ్వరరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో జరిగే ఎగ్జిబిషన్‌కు ఉచిత బస్ సౌకర్యం

దమ్మపేట: హైదరాబాద్‌లో జరిగే హార్టికల్చర్ ఎగ్జిబిషన్‌కు బస్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు అశ్వారావుపేట ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 29న హైదరాబాద్‌లో జరిగే నర్సరీ మేళా, హార్టికల్చర్ ఎగ్జిబిషన్‌కు ఆసక్తి ఉన్న రైతులు హాజరయ్యేందుకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. బస్ 28వ తేదీ రాత్రి బయల్దేరుతుందని రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నిధుల విడుదల ఎప్పుడో?

- వసతిగృహాల్లో అర్ధాంతరంగా నిలిచిన భోజనశాలల నిర్మాణం
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

అశ్వారావుపేట రూరల్: గిరిజన వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో రూ. లక్షలతో ప్రారంభించిన భోజనశాల, వంటగదుల నిర్మాణాలు నిధులు విడుదల కాకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. విద్యార్థులు ఆరుబయట ఎండలో, వర్షంలో భోజనం చేస్తుండటంతో వారి ఇబ్బందులు తీర్చేందుకు ప్రభుత్వం భవనాలు మంజూరు చేసింది. ఏడాదిన్నర క్రితం భవన నిర్మాణాలను ప్రారంభించారు. ప్రస్తుంత అవి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నిర్మాణ దశలోనే భవనాలు శిథిలవస్థకు చేరుకుంటున్నాయని, విద్యార్థుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుబయటే భోజనాలు

పాఠశాలల్లో ప్రత్యేక గదులు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే భోజనాలు చేస్తున్నారు. దీంతో చిన్నారులు ఈగలు, దోమలు, అపరిశుభ్ర వాతావరణం మూలంగా రోగాల బారిన పడుతున్నారు.

ఒక్కో భవనానికి రూ.40లక్షలు

ఈ తరుణంలో ఐటీడీఏ గిరిజన ఉప ప్రణాళిక నిధులతో భవనాల నిర్మాణాలను ప్రారంభించింది. మండలంలోని అనంతారం, పెదవాగుప్రాజెక్టు, భీమునిగూడెం, సున్నంబట్టి ఆశ్రమ పాఠశాలలతో పాటు అశ్వారావుపేటలోని బాలుర, బాలికల ఆశ్రమ వసతిగృహాల్లో భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. ఒక్కో భవనాన్ని రూ.40లక్షల వరకు టీఎఫ్‌సీ నిధులతో భోజనశాల, వంటగది నిర్మాణాలను చేపట్టారు.

ఏడాదిగా నిలిచిన పనులు

ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభం కాగా గుత్తేదారులు ఆరంభంలోనే చకచకా పనులు చేశారు. ఆ తరువాత బిల్లులు సకాలంలో చెల్లించకపోవటంతో కొద్దిరోజుల పాటు పనులు నిలిపివేయడంతో ఒక్కో గుత్తేదారుడికి రూ.15లక్షల వరకు చెల్లింపులు జరిగాయి. అనంతరం కాంట్రాక్టర్లు మరికొన్ని పనులు చేశారు. వీటికి సంబందించి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవటంతో గుత్తేదారులు ఏడాది క్రితం పనులు నిలిపివేశారు. ప్రస్తుతం భవనాలన్నీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో భవనాలు ఎప్పుడు పూర్తవుతాయో విద్యార్థుల కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం అత్యవసరం..

గిరిజన వసతిగృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్పు చేస్తున్న తరుణంలో అదనపు భవనాలు ఎంతగానో అవసరం. ఇప్పటికైనా అధికారులు నిర్మాణాలను పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం నిధులను వెంటనే మంజూరు చేసి నిర్మాణాలు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అనంతారంలో అసంపూర్తిగా భవనం

నిధుల సమస్యతోనే నిలిచాయి
శ్రీనివాస్, ఐటీడీఏ, ఏఈఈ

భవన నిర్మాణాలకు సంబంధించి నిధుల విడుదలలో జాప్యం జరుగుతుంది. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. రెండు చోట్ల నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటాం.



అశ్వారావుపేట గిరిజన బాలుర వసతిగృహంలో పూర్తికాని భోజనశాల

కార్యకర్తలకు అండగా టీఆర్ఎస్

ఎమ్మెల్యే, ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట రూరల్: టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లపుడూ అండగా ఉంటుందని ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన తెల్లమేకల వెంకటేశ్వరరావు అనే రైతు టీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉన్నాడు. గతేడాది మార్చిలో పొలం పనులకు వెళ్లి పాముకాటుకు గురై మృతిచెందారు. దీంతో పార్టీ తరపున రూ.2లక్షల బీమా మంజూరైంది. అశ్వారావుపేటలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రూ. రెండు చెక్కును వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యురాలు పోలమ్మకు తాటి వెంకటేశ్వర్లు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీలలిత, పార్టీ మండల కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొల్లు వెంకటరమణ, సర్పంచులు పొట్టా రాజులు, కారం ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

సీఎం సహాయనిధి అందజేత

అశ్వారావుపేటకు చెందిన కె.హరీశ్ అనే వ్యక్తి ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.24వేలు మంజూరయ్యాయి. అశ్వారావుపేటలో బుధవారం జరిగిన కార్యక్రమంలో హరీశ్ కుటుంబసభ్యులకు ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు చెక్కును అందజేశారు.

'మాధవ్ ఆశయ సాధనకు పోరాడాలి'

ములకలపల్లి: బడుగు బలహీన వర్గాల బానిస బతుకుల విముక్తి కోసం నిరంతరం పోరాడి అసువులు బాసిన చేడే మాధవ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్య పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో చేడే మాధవ్, 5వ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో అతి చిన్న వయస్సులో సీపీఎం పార్టీని బలోపేతం చేసేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తానం రవీందర్, మాజీ జడ్పీటీసీ చేడే పద్మావతి, ఎంపీటీసీ రవి కుమార్, వెంకటేశ్వర్లు, రాంబాబు, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐలయ్య

మట్టి విగ్రహాలనే పూజించాలి: సీఐ

అశ్వారావుపేట టౌన్: వినాయకచవితి ఉత్సవాల్లో కాలుష్యం ఏర్పడకుండా ప్రతీ ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని సీఐ రవికుమార్ సూచించారు. అశ్వారావుపేటలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీని చేపట్టారు. క్లబ్ అధ్యక్షులు యూఎస్.ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వంద విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు కంచర్ల రామారావు, కోటగిరి మోహనరావు, కొండ, కోరుకోండ రాంమ్మోహనరావు, దుర్గారావు,కంచర్ల సత్యనారాయణ, మల్లికార్జునరావు, రమేశ్ పాల్గొన్నారు.



ప్రతిమలను అందజేస్తున్న సీఐ

'సర్వ శిక్ష అభియాన్' మండల కమిటీ ఎన్నిక

చంద్రుగొండ: సర్వ శిక్ష అభియాన్ మండల జేఏసీ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బి. సేవ్యా నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్‌లో పని చేసే వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు ప్రసన్న కుమార్, వాణి, పార్వతి, నాగమణి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి: ఏటీఎఫ్

అశ్వారావుపేట రూరల్: గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐటీడీఏ ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్‌లో చేర్చాలని అందుకోసం ఈనెల 28న ఏటీఎఫ్ ఆధ్వర్యంలో భద్రాచలంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని ఏటీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు కోరారు. ఆసంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పాఠశాలలను సందర్శించారు. పెదవాగు ప్రాజెక్టు పాఠశాలలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొర్రి వెంకటేశ్ నాయకులు శ్రీనివాస్, కిరణ్‌కుమార్, రవి కుమార్, బాబురావు, రామిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

సామాజిక, ప్రజా సంఘాలు ఏకం కావాలి

- టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవి

దమ్మపేట: సామాజిక, ప్రజా సంఘాలన్నీ ఏకం కావాలని టీమాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు పిట్టల రవి అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో పిల్లి నాయుడు అధ్యక్షతన టీ-మాస్ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈనెల 26న కొత్తగూడెంలో నిర్వహించే ప్రదర్శన, సదస్సులకు గద్దర్, విమలక్క, ప్రొ.విశ్వేశ్వరరావు, తమినేని వీరభద్రం హాజరవుతారన్నారు. సమావేశంలో కొర్సా వెంకటేష్, జేమ్స్, కాంతరావు, కారం శ్రీరాములు, వాసం శ్రీను, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

టీమాస్ సభను జయప్రదం చేయాలి

ములకలపల్లి: టీ-మాస్ ఆవిర్భావ సభ ఈ నెల 26న జిల్లా కేంద్రం కొత్తగూడెం జరుగుతుందని, జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకుడు అన్నవరపు సత్యనారాయణ కోరారు. బుధవారం ములకలపల్లిలో జేఏసీ జిల్లా కో-ఛైర్మన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రవి కుమార్, వెంకటేశ్వర్లు, జిలాని, నాగభూషణం, వెంకన్న, చిన్నరాజులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి: టీడీపీ

చంద్రుగొండ: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం హసీల్దార్ కనకదుర్గకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ రసూల్ మాట్లాడుతూ రైతుల ఋణ మాఫీలను పూర్తిగా అమలుచేసి కొత్తగా ఋణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీతాయిగూడెంలోని వెంగళరావుసాగర్ ప్రాజెక్టు మరమ్మతు పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వారధి సత్యనారాయణ, బాబు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బుజ్జి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

మంత్రి తుమ్మలను పరామర్శించిన టీఆర్ఎస్ నాయకులు



మంత్రి తుమ్మలతో నాయకులు

ములకలపల్లి: ఇటీవల అస్వస్థతకు గురై విశ్రాంతి పొందుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లో బుధవారం మండల టీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల మాజీ ఎంపీపీ కీసరి లక్ష్మణ్‌రావు, టీఆర్ఎస్‌వీ నాయకులు సురభి రాజేష్, బైటి రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

'విద్రోహ దినంగా పాటించాలి'

అశ్వారావుపేట టౌన్: ఉద్యోగులు సెప్టెంబర్ ఒకటిన సామూహిక సెలవు పెట్టి పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని యూఎస్‌పీసీ నాయకులు హథీరాం, మాధవరెడ్డిలు కోరారు. అశ్వారావుపేటలో బుధవారం సామూహిక సెలవుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతీ ఉద్యోగి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వనిత, మణి, షర్మిల, సునీత, జ్యోతి, సుజాత, అమృత కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017'విజేత?


ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 2017కి గాను 'మాలతి చందూర్' సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనరాణి

2. కమ్యూనికేషన్ రంగంలో విశిష్ట సేవలందించినందుకు 'మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017'కి ఎంపికైన ఇండో అమెరికన్?
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహర్

3. ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్జిమాసున్(చైనా)
సి) వియన్నా(ఆస్టియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన 'అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ' నివేదికలో తొలిస్థానం పొందింది?
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. 2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. 'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017' పురుషుల సింగల్స్ విజేత?
ఎ) పీటర్ గ్రేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్(ఇండియా)
సి) లిన్‌డాన్(చైనా)
డి) జ్వొనిమిర్ డుర్కిన్‌జాక్(క్రొయేషియా)

7. ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియ వికెందర్ డి) ఎమ్మాస్టోన్

8. ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై 'మూడ్ ఆఫ్ ద నేషన్' పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) సబీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ

11. తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్ధిపేట)
సి) నవిపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. 2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే 'వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017'కి ఎంపికైనది?
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్)
బి) నితిష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్(కేరళ)

14. 2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియ మజుచిక్(చెస్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మందన(క్రికెట్)

15. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017'కి ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హంగ్జే(చైనా)

16. ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20ని 'సద్భావన దివస్'గా నిర్వహిస్తారు?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్

17. భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన 'నావికా సాగర్ పరిక్రమ' ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?
ఎ) ఐఎన్‌ఎస్‌వి తరిణి
బి) ఐఎన్‌ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్‌ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్‌ఎస్‌వి తలాష్

18. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం 'సాంస్కృతిక రథాన్ని' ఎక్కడి నుంచి గ్రహించారు?
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హంపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. 'నికోలాయ్ కుద్‌షెవ్' ఇటీవల ఏ దేశం తరఫున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. భారత్‌లో పాకిస్థాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహాలోధి
సి) సొహెల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మివిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. 2017కిగాను 'స్పానిష్ సూపర్ కప్' ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లీష్ ప్రిమీయర్ క్లబ్ డి) రివర్స్ ప్లెటో క్లబ్

23. 2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని 'పోలియో రహిత దేశం'గా ప్రకటించింది?
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్థాన్

24. 'అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018'కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేథోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. ఇటీవల విడుదలైన 'ఇండియా ఎట్ 70; స్నాప్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్' పుస్తక రచయిత?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృతా వర్గీస్ డి) అరుంధతిరాయ్

29. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'నమో యువ రోజ్‌గార్ కేంద్ర' ప్రధాన ఉద్దేశం?
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
డి) రాష్ట్ర నిర్మాణంలో యువత నైపుణ్యాల వినియోగం

30. 2017 ఆగస్టు 18న దోమలను నిరోధించే ప్రత్యేక రైలును ప్రవేశపెట్టిన నగరం?
ఎ) ఢిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూర్

31. కేంద్రమంత్రి స్మృతి ఇరాని ప్రారంభించిన చేనేత ఉత్పత్తి, ఎగుమతి సంస్థ 'ఒరియంట్ క్రాఫ్ట్ లిమిటెడ్' ఏ రాష్ట్రానికి చెందింది?
ఎ) చత్తీస్‌గఢ్ బి) జార్ఖండ్ సి) మధ్యప్రదేశ్ డి) కేరళ

32. 'ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సెల్' 2017 ఆగస్టులో ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిస్థానం పొందిన బ్యాట్స్‌మన్?
ఎ) కేన్ విలియమ్సన్ బి) షకిబుల్ హసన్
సి) విరాట్ కోహ్లి డి) ఎవరూ కాదు

33. శ్రీలంక నేవీ చీఫ్‌గా నియమితులైన తమిళ సంతతి వ్యక్తి?
ఎ) కదిరగమర్. ఆర్ బి) డబ్ల్యూ.హెచ్.పెరెర
సి) పెరియార్ మురుగన్ డి) ట్రావిస్ సిన్నిహ్

34. ఎదగకుండా జన్మించిన శిశువుల పరిరక్షణ కోసం కృత్రిమ గర్భసంచిని రూపొందించింది?
ఎ) యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా
బి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
సి) టోక్యో యూనివర్సిటీ, జపాన్ డి) ఎ, సి

35. స్కూల్ టీచర్ల కోసం 'మేఘశాల' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) హర్యాన

క్రీడా పురస్కారాలు

36. 2017కిగాను 'రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున' అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) ఎస్.కె.శర్మ బి) సి.కె.ధక్కర్
సి) మేరికోం డి) కరణం మల్లీశ్వరి

37. 2017కిగాను 'ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య' అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) మేరికోం బి) కరణం మల్లీశ్వరి
సి) అభినవ్ బింద్రా డి) పుల్లెల గోపిచంద్

38. 2017కిగాను 'రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న'కి ఎంపికైన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝూరియ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) హైజంప్ బి) టెన్నిస్
సి) జావెలిన్ త్రో డి) షాట్‌పుట్

39. దేవేంద్రతోపాటు 2017కిగాను 'ఖేల్‌రత్న' పొందిన మరో క్రీడాకారుడు?
ఎ) ఎస్.ఎస్.పి.చౌరాసియా - గోల్ఫ్
బి) సర్దార్‌సింగ్ - హాకీ
సి) జ్యోతిసురేఖ - షూటింగ్
డి) విరాట్ కోహ్లి - క్రికెట్

40. 2017కిగాను 'ధ్యాన్‌చంద్' అవార్డుకి ఎంపికైన ముగ్గురిలో లేనిది?
ఎ) సత్తిగీత - అథ్లెటిక్స్
బి) భూపేందర్‌సింగ్ - అథ్లెటిక్స్
సి) సయ్యద్ షాహిద్ హకీం - ఫుట్‌బాల్
డి) సుమరయి టెటె - హాకీ

41. 2017కిగాను 'ద్రోణాచార్య' అవార్డుకి ఎంపికైన ఏడుగురిలో మరణానంతరం పొందిన వ్యక్తి?
ఎ) హీరానంద్ కటారియా - కబడ్డీ
బి) బ్రిజ్‌భూషణ్ మహంతి - బాక్సింగ్
సి) పి.ఎ.రాఫెల్ - హాకీ
డి) డాక్టర్ ఆర్.గాంధీ - అథ్లెటిక్స్

42. 2017కిగాను 'అర్జున' అవార్డు పొందిన 17 మందిలో సరైన వారిని గుర్తించండి?
1. ప్రశాంతసింగ్ - బాస్కెట్ బాల్
2. చటేశ్వర్ పుజరా - క్రికెట్
3. ఎస్.వి. సునీల్ - హాకీ
4. మరియప్పన్ తంగవేలు - పారా అథ్లెట్
5. వరుణ్ సింగ్ బాటి - పారా అథ్లెట్
6. సాక్షి మాలిక్ - రెజ్లింగ్
ఎ) అన్నీ సరైనవే
బి) 6 మినహా అన్నీ సరైనవే
సి) 1, 2, 4 సరైనవి డి) 2 మాత్రమే సరైనది

సమాధానాలు

1) సి	7) డి	13) సి
2) ఎ	8) డి	14) ఎ
3) డి	9) బి	15) బి
4) ఎ	10) ఎ	16) బి
5) సి	11) ఎ	17) ఎ
6) బి	12) ఎ	18) బి

19) ఎ	27) ఎ	35) సి
20) సి	28) బి	36) బి
21) డి	29) బి	37) డి
22) ఎ	30) ఎ	38) సి
23) సి	31) బి	39) బి
24) బి	32) సి	40) ఎ
25) డి	33) డి	41) డి
26) బి	34) డి	42) బి

JOBS ఉద్యోగాలు

బిసిపిఎల్

గెయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, న్యూమలీఘర్ రిఫైనరీ లిమిటెడ్, అసోం ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న బ్రహ్మపుత్ర క్రాకర్ & పాలిమర్ లిమిటెడ్ (బిసిపిఎల్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

పోస్టులు - ఖాళీలు: సీనియర్ మేనేజర్(హెచ్ఆర్)2, మేనేజర్(కెమికల్ 2, ఎఫ్& ఎ 1), డిప్యూటీ మేనేజర్(కెమికల్ 2, హెచ్ఆర్ 1), సీనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ 1, ఇన్‌స్ట్రుమెంటేషన్ 1, మెకానికల్ 1), సీనియర్ ఆఫీసర్(లా 1, మార్కెటింగ్ 2)

అర్హత: పోస్టును అనుసరించి 50 శాతం మార్కులతో డిగ్రీ/ ఎంబిఏ/(పీజీ/ పీజీ డిప్లొమా)(పర్సనల్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్& ఇండస్ట్రియల్ రిలేషన్స్)/ ఎల్ఎల్‌బి/ ఎల్ఎల్ఎం / బిటెక్(కెమికల్/ పెట్రో కెమికల్/ కెమికల్ టెక్నాలజీ/ పెట్రో కెమికల్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్/మాన్యుఫ్యాక్చరింగ్/ మెకానికల్ & ఆటోమొబైల్)/ సీఏ/ ఐసిడబ్ల్యుఏఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: పోస్టును అనుసరించి 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.200

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: www.bcplonline.co.in

ఎన్‌బిసిసి

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 94

పోస్టులు - ఖాళీలు: జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 1, అడిషనల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 6, ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) 5, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్ 10, ఎలక్ట్రికల్ 5), డిప్యూటీ మేనేజర్(లా) 2, అసిస్టెంట్ మేనేజర్(లా 2), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్(సివిల్ 10, ఎలక్ట్రికల్ 3), అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్ఎం 2, రాజ భాష 2), జూనియర్ ఇంజనీర్(సివిల్ 40, ఎలక్ట్రికల్ 4)

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: www.nbccindia.com

సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?

ఆధునిక భారతదేశ చరిత్ర



ఎస్. రాజా చక్రధర్
సీనియర్ ఫ్యాకల్టీ

1. 'నాకు రక్తమివ్వండి. మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని ప్రకటించిన జాతీయోద్యమ నేత?
ఎ) భగత్‌సింగ్ బి) చంద్రశేఖర్ అజాద్
సి) సుభాష్ చంద్రబోస్ డి) ఖుదీరాంబోస్

2. 1897 జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించిన ప్రాంతం?
ఎ) కలకత్తా బి) కాన్పూర్ సి) ఢాకా డి) కటక్

3. సుభాష్ చంద్రబోస్ జన్మించిన భవనం నేడు చారిత్రక ప్రాధాన్యత పొందింది. దాని పేరు?
ఎ) ప్రగతి భవన్ బి) జానకీనాథ్ భవన్
సి) జననీ భవన్ డి) జాగృతి భవన్

4. ఐసిఎస్ ఉద్యోగాన్ని వదులుకొని సుభాష్ చంద్రబోస్ జాతీయోద్యమంలోకి ప్రవేశించిన సంవత్సరం?
ఎ) 1919 బి) 1920 సి) 1921 డి) 1922

5. సుభాష్ చంద్రబోస్ వ్యక్తిత్వంపై ప్రభావం చూసిన జాతీయోద్యమ నేత?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) చిత్తరంజన్ దాస్
సి) బిపిన్ చంద్రపాల్ డి) గాంధీజీ

6. గాంధీజీని జాతిపితగా అభివర్ణించిన జాతీయ నాయకుడు?
ఎ) గోపాలకృష్ణ గోఖలే బి) రవీంద్రనాథ్ ఠాగూర్
సి) సిఆర్.దాస్ డి) సుభాష్ చంద్రబోస్

7. సుభాష్ చంద్రబోస్ ఏ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు?
ఎ) చంపారన్ సత్యాగ్రహం
బి) ఖిలాఫత్ ఉద్యమం
సి) సహాయనిరాకరణ ఉద్యమం
డి) ఉప్పు సత్యాగ్రహం

8. గాంధీజీ ఏ ఉద్యమంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రను సుభాష్ చంద్రబోస్ నెపోలియన్స్ ఎల్బాదీవి నుంచి చేపట్టిన యాత్రతో పోల్చారు?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) ఉప్పు సత్యాగ్రహం సి) వ్యక్తి సత్యాగ్రహం
డి) క్విట్ ఇండియా ఉద్యమం

9. సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?
ఎ) గాంధీజీ బి) నెహ్రూ
సి) సి.ఆర్.దాస్ డి) బిపిన్ చంద్రపాల్

10. ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడిగా బోస్ 1938లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు?
ఎ) కలకత్తా బి) లక్నో
సి) బొంబాయి డి) హరిపురి

11. ప్రణాళిక సంఘాన్ని స్థాపించి, భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించింది?
ఎ) గాంధీజీ
బి) మోక్షగుండం విశ్వేశ్వరయ్య
సి) సుభాష్ చంద్రబోస్
డి) నెహ్రూ

12. గాంధీజీ బలపర్చిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను బోస్ ఏ కాంగ్రెస్ సమావేశంలో ఓడించారు?
ఎ) త్రిపురి బి) హరిపురి
సి) కలకత్తా డి) లక్నో

13. సుభాష్ చంద్రబోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' రాజకీయ పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1937 బి) 1938 సి) 1939 డి) 1940



14. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టేందుకు బోస్ గృహనిర్బంధం నుంచి తప్పించుకొని భారత్‌ను వదిలిన సంవత్సరం?
ఎ) 1939 బి) 1940 సి) 1941 డి) 1942

15. కాబూల్, మాస్కో మీదుగా బోస్ ఏ నగరానికి చేరుకొన్నాడు?
ఎ) బెర్లిన్ బి) పారిస్ సి) లిస్బన్ డి) జెనీవా

16. సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలోని రేడియో కేంద్రం ద్వారా భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు?
ఎ) రష్యా బి) ఫ్రాన్స్ సి) జర్మనీ డి) జపాన్

17. భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి సాయం చేస్తామని బోస్‌కు హామీ ఇచ్చిన దేశం?
ఎ) జర్మనీ బి) జపాన్ సి) రష్యా డి) ఏదీకాదు

18. టోక్యోలో సుభాష్ చంద్రబోస్‌తో చర్చలు జరిపిన 'టోజో' ఏ పదవిలో ఉన్నారు?
ఎ) జపాన్ అధ్యక్షుడు బి) ప్రధాన మంత్రి
సి) సైన్యాధికారి డి) విదేశాంగ మంత్రి

19. 1943 నుంచి సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలో తన సైనిక కార్యక్రమాలు ప్రారంభించారు?
ఎ) జర్మనీ బి) జపాన్
సి) సింగపూర్ డి) ఇండోనేషియా

20. 'భారత జాతీయ సైన్యం' ఏర్పాటుకు పునాది వేసింది?
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్
బి) రాజ్‌బిహారీ బోస్
సి) ఖుదీరాంబోస్ డి) ఎవరూ కాదు

21. 1942లో టోక్యోలో ప్రవాస భారతీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్ బి) లాల్ హరిదయాళ్
సి) సుభాష్ చంద్రబోస్ డి) రాజ్‌బిహారీ బోస్

22. సుభాష్ చంద్రబోస్ 'అజాద్ హింద్ ఫౌజ్'ను ఎక్కడ వ్యవస్థీకరించారు?
ఎ) టోక్యో బి) బెర్లిన్ సి) సింగపూర్ డి) మాస్కో

జనరల్ స్టడీస్ - ఇండియన్ హిస్టరీ

23. అజాద్ హింద్ ఫౌజ్‌లోని మహిళ రెజిమెంట్‌కి గల పేరు?
ఎ) ఝాన్సీరాణి రెజిమెంట్
బి) దుర్గావతి రెజిమెంట్
సి) రాణి అబ్బక్క రెజిమెంట్
డి) మహిళశక్తి రెజిమెంట్

24. భారత జాతికి సుభాష్ చంద్రబోస్ అందించిన నినాదాలు?
ఎ) జైహింద్ బి) చల్లో ఢిల్లీ సి) డూ ఆర్ డై డి) ఎ, బి

25. మొట్టమొదటి భారత ప్రభుత్వాన్ని నేతాజీ ఎక్కడ ఏర్పాటు చేశారు?
ఎ) టోక్యో బి) రంగూన్
సి) సింగపూర్ డి) మలేషియా

26. నేతాజీ ఏర్పాటు చేసిన భారత ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశం?
ఎ) రష్యా బి) జర్మనీ సి) జపాన్ డి) ఏదీకాదు

27. 1943లో టోక్యోలో జరిగిన తూర్పు ఆసియా దేశాల సమావేశానికి సుభాష్ చంద్రబోస్ ఏ హోదాలో హాజరయ్యారు?
ఎ) భారత సైన్యాధినేత బి) విదేశాంగ ప్రతినిధి
సి) భారత ప్రభుత్వాధినేత డి) ఏదీకాదు

28. అజాద్ హింద్ ఫౌజ్ పాలన కిందకి వచ్చిన తొలి భారత భూభాగం?
ఎ) అండమాన్ నికోబార్ దీవులు బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) సిక్కిం

29. అండమాన్ నికోబార్ దీవులకు సుభాష్ చంద్రబోస్ పెట్టిన పేరు?
ఎ) స్వరాజ్ దీవులు బి) షాహీద్ దీవులు
సి) అజాదీ దీవులు డి) ఎ, బి

30. సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో జాతీయ సేనకు, బ్రిటీష్‌వారికి మధ్య ప్రత్యక్ష యుద్ధం జరిగిన సంవత్సరం?
ఎ) 1943 బి) 1944 సి) 1945 డి) 1946

31. బ్రిటీష్‌వారిని ఓడించి ఆజాంద్ హింద్‌ఫౌజ్ జాతీయ పతాకాన్ని ఎక్కడ ఎగురవేసింది?
ఎ) మౌఢక్ బి) మయన్మార్
సి) అండమాన్ దీవులు డి) ఏదీకాదు

32. ఆంగ్లేయుల నుంచి జాతీయ సైనం స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలు?
ఎ) మౌఢక్ బి) కోహిమా సి) ఇంఫాల్ డి) పైవన్నీ

33. భారత జాతీయ సైన్యం సాగించిన సమరం ఆగిపోవడానికి కారణం?
ఎ) జపాన్‌పై అమెరికా అణుదాడి
బి) బ్రిటీషర్లు రంగూన్‌ను ఆక్రమించడం
సి) జపాన్ సైనికుల తిరోగమనం
డి) పైవన్నీ

34. తైవాన్ దీవుల్లో సుభాష్ చంద్రబోస్ ప్రయాణించే విమానం ప్రమాదానికి గురైన సంవత్సరం?
ఎ) 1945 ఆగస్టు 15 బి) 1946 ఆగస్టు 16
సి) 1946 ఆగస్టు 17 డి) 1946 ఆగస్టు 18

35. బ్రిటీషర్లకు బంధీలుగా చిక్కి ఎర్రకోటలో న్యాయ విచారణ ఎదుర్కొన్న జాతీయ సైన్యం ప్రతినిధులు?
ఎ) షాన్‌వాజ్‌ఖాన్ బి) కల్నల్ టి.కె.షెనగల్
సి) బి.ఎస్.ధిల్లాన్ డి) పైవారందరూ

36. భారత సైనికాధికారుల తరపున వాదించి, వారి విడుదలకు తోడ్పడినవారు?
ఎ) బల్లూభాయ్ దేశాయ్ బి) అసఫ్ అలీ
సి) తేజ్ బహదూర్ సప్రూ డి) పైవారందరూ

సమాధానాలు

1) సి	6) డి	11) సి	16) సి	23) ఎ	30) బి
2) డి	7) సి	12) ఎ	17) బి	24) డి	31) ఎ
3) బి	8) బి	13) సి	18) బి	25) సి	32) డి
4) ఎ	9) ఎ	14) సి	19) సి	26) సి	33) డి
5) బి	10) డి	15) ఎ	20) ఎ	27) సి	34) డి
			21) డి	28) ఎ	35) సి
			22) సి	29) డి	36) డి

JOBS ఉద్యోగాలు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ - **గ్రౌండ్ డ్యూటీ** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 28 **కాంట్రాక్ట్ వ్యవధి:** అయిదేళ్లు
పోస్టులు - ఖాళీలు: మేనేజర్(ఫ్లయిట్ డిస్పాచ్) 14, మేనేజర్(ఆపరేషన్ ఎక్స్‌ప్యాట్ సెల్) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ డిస్పాచ్) 6, ఆఫీసర్ - కాక్ పిట్ 1, అసిస్టెంట్ టెక్నికల్ (లైబ్రరి) 1, డిప్యూటీ మేనేజర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సింథటిక్ ఫ్లయిట్ (ఇన్‌స్ట్రక్టర్) 2, అసిస్టెంట్ ట్రైనింగ్ 1
వయసు: 21 ఏళ్లు
అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్(ఎంపిసి) / డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అదనపు అర్హతల వివరాలకోసం వెబ్‌సైట్‌లోని ప్రకటన చూడవచ్చు.
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపాలి
దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ: ఆగస్టు 31
చిరునామా: The Chief of HR, Air India Express Limited, Airlines House, Durbar Hall Road, Near Gandhi Square, Kochi 682016
వెబ్‌సైట్: www.airindiaexpress.in

సిఇఐఎల్

సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సిఇఐఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 23
పోస్టులు - ఖాళీలు: ఇంజనీర్స్(క్యూసీ/ క్యూఏ) 4, సీనియర్ ఇంజనీర్స్ (క్యూసీ/ క్యూఏ) 5, డిప్యూటీ మేనేజర్ (క్యూసీ/ క్యూఏ) 5, ఇంజనీర్ స్పెషలిస్ట్ 6, సీనియర్ ఇంజనీర్ స్పెషలిస్ట్ 2, ఆఫీసర్ 1
అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్(మెకానికల్/ ప్రొడక్షన్/ మెటలర్జికల్)/ఎంబిఏ(హెచ్ఆర్)/ పీజీ(పర్సనల్ మేనేజ్‌మెంట్ & లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి
వెబ్‌సైట్: www.ceil.co.in

ఎన్ఐసిఇడి

కోల్కతాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలరా & ఎంటరిక్ డిసీజెస్(ఎన్ఐసిఇడి)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 19

మెడికల్ ఎపిడెమియోలజిస్ట్(సైంటిస్ట్ సి)
ఖాళీలు: 1
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ విభాగంలో ఆరేళ్ల అనుభవం ఉండాలి.
సీనియర్ రీసెర్చ్ ఫెలో(మెడికల్) **ఖాళీలు:** 12
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి
సీనియర్ రీసెర్చ్ ఫెలో(నాన్ మెడికల్) **ఖాళీలు:** 1
అర్హత: 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఫీల్డ్ కన్సల్టెంట్ / మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
డేటా మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: (డిగ్రీ/ పీజీ)(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో అయిదేళ్ల అనుభవం ఉండాలి.
అసిస్టెంట్ డేటా మేనేజర్/ డేటా సెక్రటరీ
ఖాళీలు: 1
అర్హత: డిగ్రీ(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణత + కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి.
అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ / అకౌంటెంట్ **ఖాళీలు:** 2
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత విభాగంలో అయిదేళ్ల అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 5
వేదిక: National Institute of Cholera & Enteric Diseases, (NICED II Building within ID & BG Hospital Campus), 57, Beliaghata Main Road, Kolkata - 700010
వెబ్‌సైట్: www.niced.org.in/

ఎన్‌సిఇఆర్‌టి - డిఇఇ

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఇ)- తాత్కాలిక ప్రాతిపదికన **జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో**ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు:** 6
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్/ మేథమెటిక్స్/ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 40 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెట్ అర్హత పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16,000 కాగా నెట్ స్కోరు లేని అభ్యర్థులకు రూ.14000
ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 29
వేదిక: Department of Elementary Education(DEE), 4th Floor, Room No. 415, G.B Pant Block, NCERT, Sri Aurobindo Marg, New Delhi- 110016
వెబ్‌సైట్: www.ncert.nic.in

జలసిరి.. విస్తారంగా వరి!


పెద్దవాగు ప్రాజెక్టు గేటు ఎత్తిన దృశ్యం

- **నిండుకుండల్లా ప్రాజెక్టులు, చెరువులు**
- **జోరుగా వరినాట్లు.. కూలీలకు డిమాండ్**

(కొత్తగూడెం-ఆంధ్రజ్యోతి)

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు జలకళతో తొణికిసలాడుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముమ్మరంగా నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ముప్పావువంతుకు మించి నాట్లు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మిగతా శాతం నాట్లు కూడా పూర్తయ్యే అవకాశం కన్పిస్తోంది. నాట్లు జోరందుకోవడంతో ట్రాక్టర్లు, కూలీలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఒక్కో ఎకరం నాటు వేసినందుకు రూ.2000 వసూలు చేస్తున్నారు.

కిన్నెరసానికి 406 అడుగులు

పాల్వంచలోని కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి పూర్తిస్థాయిలో నీరు చేరడంతో 406 అడుగులకు నీటిమట్టం చేరుకొంది. ప్రాజెక్టు పరిధిలోని రెండు కాల్వల్లో పదివేల ఎకరాలకు సాగునీరందుతోంది. అనధికారికంగా మరో ఐదు ఎకరాలు ఉంటుందని సమాచారం. కేటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తికి కిన్నెరసాని నీరు సరఫరా చేస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణ ప్రజల దాహార్తిని కిన్నెరసాని తీరుస్తోంది.

సింగభూపాలెం 18 అడుగులు

సుజాతనగర్ మండలంలో సింగభూపాలెం చెరువు నీటిమట్టం 18 అడుగులకు చేరింది. ఈ చెరువు ఆయకట్టు కింద సుమారు 2,500 ఎకరాల్లో నాట్లు వేశారు. మిషన్‌కాకతీయ పథకం కింద రాష్ట్రంలోనే ఈ చెరువుకు అత్యధికంగా నిధులు మంజూరు చేశారు. పూడిక తొలగించారు. అశ్వారావుపేట మండలంలోని పెదవాగు నీటిమట్టం 21 అడుగులకు చేరింది. దీని కింద సుమారు 16వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 11 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఏపీలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పొలాలకు ఈ ప్రాజెక్టు నుంచే సాగునీరు సరఫరా అవుతోంది. ఇదే మండలంలోని గుండేటివాగు కూడా నిండింది. దీనికి కింద 600 ఎకరాలకు సాగునీరు అందుతోంది. బువడం చెరువు, లోతువాగు, పాలవాగు, పోతులవాగు నిండుకుండలా మారాయి.

నిండుకుండలా మూకమామిడి

ములకలపల్లి మండలంలో మూకమామిడి ప్రాజెక్టు జలకళతో తొణికిసలాడుతోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 0.16టీఎంసీలు. ప్రాజెక్టు పరిధిలో 3,260 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం నాట్లు పూర్తయ్యాయి. చర్ల మండలం తాలిపేరు కూడా నిండుకుండలా మారింది. ఇప్పటికే పలు మార్లు ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. ఛత్తీస్‌గఢ్‌లో ఏమాత్రం భారీ వర్షం కురిసినా ప్రాజెక్టు నిండుతోంది. ఆయకట్టు పరిధిలో నాట్లు పూర్తయ్యాయి. అశ్వాపురం మండలంలో తుమ్మలచెరువు నిండింది. ఆలస్యంగా నార్లు పోసిన రైతులు నాట్లు వేస్తున్నారు. దీంతో ట్రాక్టర్లకు, కూలీలకు డిమాండ్ పెరిగింది. చంద్రుగొండ మండలంలో సీతాయిగూడెం ప్రాజెక్టు, వెంగళరావుసాగర్ ప్రాజెక్టు జలకళతో ఉట్టిపడుతున్నాయి.


జలకళతో సుజాతనగర్ మండలం సింగభూపాలెం ప్రాజెక్టు


కిన్నెరసాని రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిమట్టం


అలుగు పారుతున్న అశ్వారావుపేట మండలంలోని గుండేటివాగు

జనాన్ని చైతన్యపరిచేదే జానపదం

జాయింట్ కలెక్టర్ రాంకిషన్

పాల్వంచ టౌన్: గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబింపజేసేదే జానపదమని, జనచైతన్యం కోసమే జానపదం పురుడుపోసుకున్నదని జాయింట్ కలెక్టర్ రాంకిషన్ పేర్కొన్నారు. పాల్వంచలో బుధవారం సీతారామ కల్యాణ మండపంలో ప్రపంచ జానపద జాతర-2017 ఉత్సవాన్ని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఘనంగా నిర్వహించింది. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక సారధి కళాకారులతో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి కల్యాణ మండపం వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం కల్యాణ మండపంలో జరిగిన ప్రపంచజానపద జాతర -2017ను జేసీ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జానపద జాతరను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ సంస్కృతిని ప్రతిభింబించే ఈ జానపదాలను పరిరక్షించుకోవాలన్నారు. తానా సభకు ఎంపికైన కళాకారులను అభినందించారు. దీనికి కృషి చేస్తున్న కళాకారులను సన్మానించారు. కళాకారులు ప్రదర్శించిన వివిధ కళారూపాలు గ్రామీణ సంస్కృతిని ఇనుమడింపచేశాయి. కళాకారులకు పుట్టినిల్లుగా కొమ్ముకోయ నృత్యం అంతర్జాతీయ కీర్తిని ఆర్జించిందన్నారు. అనంతరం కళాకారులు తమకు డప్పు, వాయిద్య కళాకారులుగా గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని డీపీఆర్‌వోకు విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి శీలం శ్రీనివాసరావు, జిల్లా జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు సిద్దెల హుస్సేన్, పాయం ముత్తయ్య, రఘు, శ్రీపాద సత్యనారాయణ, కేటీపీఎస్ అధికారి పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న జేసీ రాంకిషన్


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

పింఛన్.. బాంచెన్!

బ్యాంకుల ఎదుట పండుటాకుల పడిగాపులు

ప్రభుత్వం నెలనెలా ఇచ్చే రూ. వెయ్యి పింఛన్ కోసం పండుటాకులు నానాపాట్లు పడుతున్నారు. మంగళవారం బ్యాంక్ సిబ్బంది ఒక్కరోజు సమ్మె నిర్వహించారు. బుధవారం పింఛన్ కోసం చంద్రుగొండ ఎస్‌బీఐకి వృద్ధులు భారీగా వచ్చారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయకపోవడంతో గంటల తరబడి క్యూలో ఉండి పింఛన్ తీసుకున్నారు. కొంద రైతే వేచి చూసే ఓపిక లేక ఇళ్లకు వెనుదిరిగారు.

-సుధాకర్, చంద్రుగొండ, ఆంధ్రజ్యోతి



బ్యాంకు ఎదుట వృద్ధుల పడిగాపులు

పుష్పం.. పత్రం.. ఆయుర్వేదం..!



- గణపతి పూజలో ఆయుర్వేద రహస్యం
- 21 రకాల ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు..!

మధిర: మండపంలో గణపతి విగ్రహం ప్రతిష్ఠించింది మొదలు.. నిమజ్జనం వరకు భక్తి శ్రద్ధలతో రెండుపూటలా శాస్త్రోత్తంగా పూజలు చేయటం ఆనవాయితీ. ఈ సందర్భంగా 21 రకాల పత్రాలను పూజలో ఉపయోగిస్తారు. ఇంత వరకూ అందరికీ తెలుసు. కానీ.. ఈ పత్రాల్లోని ఆయుర్వేద రహస్యం గురించి మాత్రం చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో ఆకుల్లోని ఔషధ గుణాలు, వాటి ఉపయోగాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...



మాచీపత్రం..
పెదవులు, దంతాలు, చిగుళ్లు, నాలుక, కంఠం, అంగిలి, నోరు ఈ ఏడు భాగాలను కలిపి ముఖం అంటారు. ఈ భాగాల నుంచి వచ్చే దుర్గంధాన్ని హరించి, సుగంధాన్ని అందించే ఔషధ గుణం ఈ మాచీపత్రానికి ఉంటుంది.



బిల్వపత్రం:
తెలుగులో మారేడు ఆకు అంటారు. ఇది మధుమేహానికి ఔషధంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. బిల్వఫలంలోని గుజ్జు మలబద్ధకాన్ని తొలగించి, ఆరోగ్యాన్ని చేకూర్చుతుందని ఆయుర్వేదం చెపుతోంది.



చూతపత్రం:
చూతపత్రం అంటే మామిడి ఆకు. ఇది నెగిటివ్ ఎనర్జీని తొలగిస్తుంది. గాలి సోకటం వల్ల ఆరోగ్యం బాగుంటుంది. మూత్ర వ్యాధిని తగ్గిస్తుంది. మామిడిచిగుళ్ల చక్కని కంఠస్వరాన్ని ఇస్తాయి. గుండె ల్లో మంట, వాంతులు, అతిసారం నివారణలో చూత పత్రం విశేషంగా పనిచేస్తుంది.



తులసి పత్రం:
ఇది విషపురుగులను దరిచేరనివ్వదు. కంటికి కన్పించని సూక్ష్మజీవులను నాశనం చేస్తుంది. గజకర్ణం అనే చర్మవ్యాధిని నివారిస్తుంది.



దేవదారు పత్రం:
ఈ ఆకు నుంచి తీసిన నూనె కీళ్లనొప్పుల నివారణకు ఉపయోగపడుతుంది. దీనికి దేవకాష్ట అని మరో పేరు కూడా ఉంది. ఇది హిమాలయాల్లో ఎక్కువగా దొరుకుతుంది.



అశ్వత్థపత్రం:
రావిచెట్టు ఆకు. ఇది స్త్రీ సంబంధ వ్యాధులను నివారించటంలో దివ్య ఔషదంగా పనిచేస్తుంది.



సింధువారపత్రం:
అంటే వావిలి చెట్టు ఆకు. ఈ ఆకు వాతరోగాన్ని తగ్గిస్తుంది.



శమీపత్రం:
శమీపత్రం అంటే జమ్మి ఆకు. త్రిదోషజన్యమైన వ్యాధులను నివారిస్తుంది.



బదరీపత్రం:
రేగుచెట్టు ఆకును బదరీపత్రం అంటారు. ఇది పొట్ట పెరగడాన్ని నిరోధించి, తిన్న ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేసేందుకు ఉపకరిస్తుంది.



బృహదిపత్రం:
దీనిని తెలుగులో మొలక అంటారు. ఇది శ్వాససంబంధ వ్యాధుల్లో విశేషంగా ఉపకరిస్తుంది.



జాజిపత్రం:
ఈ ఆకు నుంచి తీసిన సుగంధ తైలం తలనొప్పి, చెవినొప్పికి మంచి ఔషధంగా పనిచేస్తుంది.



విష్ణుక్రాంత పత్రం:
ఇది మంచి దృష్టిని, కంఠస్వరాన్ని, జ్ఞాపకశక్తిని ఇస్తుంది. మూత్రదోషాలతో, కుష్టు వ్యాధి నివారణలో విశేషంగా ఉపకరిస్తుంది.



దుర్వాయుగ్మం:
తెలుగులో గరిక అంటారు. చర్మరోగం, చుండ్రు నివారణకు ఉపకరిస్తుంది. చెడ్డకలలు వచ్చినప్పుడు చేసే మూత్రవిసర్జన లాంటి సమస్యలను నివారిస్తుంది.



మరువకపత్రం:
ఈ ఆకును ధవనం, మరువం అంటారు. ఇది దుర్గంధాన్ని పారదోలుతుంది. పురుగులను వెళ్లగొడుతుంది.



దాడిమీపత్రం:
దానిమ్మ ఆకు. ఇది అజీర్ణాన్ని పోగొడుతుంది. వాంతులను నివారిస్తుంది. జలుబును తగ్గిస్తుంది. ఆకలి కల్గించేందుకు ఉపకరిస్తుంది.



ఆపామార్గపత్రం:
అంటే ఉత్తరేని చెట్టు దీని విత్తనాల వలతో పాయసం వల్ల అతి ఆకలిని నివారిస్తుంది. కడుపునొప్పి, శ్వాస వ్యాధుల నివారణకు విశేషంగా పనిచేస్తుంది.



ఆర్కపత్రం:
అంటే జిల్లేడు ఆకులు. ఎర్రజిల్లేడు, తెల్లజిల్లేడు అనే రెండురకాలు ఉంటాయి. తెల్లజిల్లేడు శ్రేష్ఠమైంది. పాముకాటుకు విరుగుడు, నపుంసకత్వ నివారణ, శ్వాసకోశ వ్యాధుల్లో, పుండ్లను మాన్పుడంలో దివ్యఔషధంగా పనిచేస్తుంది.



కరవీరపత్రం:
అంటే గన్నేరు. దీని పాలు మొండిపుండ్లను మాన్పుతాయి. వాపులను, గడ్డలను తగ్గిస్తాయి. తేలుకాటుకు కరవీరపత్రం పాలు మంచి ఔషధం.



గండలీ పత్రం:
ఈ ఆకు జ్వరాన్ని తగ్గిస్తుంది. దాహం తగ్గడానికి ఉపయోగపడుతుంది.



అర్జున పత్రం:
అంటే మద్దిచెట్టు ఆకు. రక్తదోషాలను, టీబీ వ్యాధులు, గుండెకు సంబంధించిన వ్యాధులను నివారించటంలో ఉపయుక్తమైంది.



దత్తూరపత్రం:
ఉమ్మెత్త ఆకు. ఈ ఆకులు జ్వరాన్ని, కుష్టు, కృతి తగ్గించుటకు, పుండ్లు మాన్పుటకు, నొప్పి తగ్గుటకు ఉపయోగపడుతుంది. శ్వాస వ్యాధులను తగ్గిస్తుంది. విష ప్రభావాన్ని శరీరమంతటా వ్యాపించకుండా నిరోధించే విశేష గుణం ఈ ఆకులో ఉంది.

మట్టి గణపతికి జై



- భక్తుల్లో పెరుగుతున్న అవగాహన
- మట్టి విగ్రహాల కొనుగోలుకు మొగ్గు

ఖమ్మం సాంస్కృతికం: 'మట్టి గణపతినే పూజించండి.. పర్యావరణాన్ని రక్షించండి..' అంటూ కొన్నేళ్లుగా కొనసాగుతున్న ప్రచారం.. ఇప్పుడిప్పుడే ఫలితాన్నిస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల ఎన్నో అనర్థాలున్నాయన్న అవగాహన పెరుగుతుండడంతో.. మట్టి విగ్రహాల కొనుగోలుకు జనం మొగ్గు చూపుతున్నారు.

పెరుగుతున్న ఆసక్తి..

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మట్టి విగ్రహాల కొనుగోలు పెరిగింది. ఈ విగ్రహాలను ఉచితంగా ప్రజలకు అందించేందుకు ఇటు స్వచ్ఛంద సంస్థలతోపాటు, పలు ఉత్సవ కమిటీలు ముందుకు వచ్చాయి. వివిధ కూడళ్ళ, విద్యాసంస్థల వద్ద నేడు ఉచితంగా మట్టి వినాయకుల్ని పంపిణీ చేయనున్నారు.

హైదరాబాద్ నుంచి ఉచిత రవాణా..

మట్టి విగ్రహాల కొనుగోలును ప్రోత్సహించేందుకు స్తంభాద్రి ఉత్సవ సమితి కార్యదర్శి సాయికిరణ్ ఉచిత ట్రాన్స్‌పోర్టుకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన మట్టి విగ్రహాలను ఖమ్మం తరలించేందుకు ప్రత్యేకంగా ఉచిత వాహనం ఏర్పాటు చేసి, ఆయా మండపాలకు విగ్రహాలను తరలించారు.

ఆరు అడుగులు..

మట్టి గణపతి విగ్రహాలు అడుగు ఎత్తు మొదలుకొని ఆరు అడుగుల వరకు అమ్మకాలు జరిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌కు విగ్రహాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా చక్కటి ఆకృతుల్లో, రంగుల్లో తీర్చిదిద్దారు. దీంతో.. మట్టి విగ్రహాలు సైతం ఆకర్షణీయంగా ఉండటంతో కొనుగోలు చేసేందుకు మండపాల నిర్వాహకులు ఎక్కువగానే ఆసక్తి చూపారు.



మూడేళ్లుగా మట్టి విగ్రహాలే..
మల్లిఖార్జున్, కొనుగోలుదారుడు

మూడు సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నాం. వీటి వల్ల పర్యావరణానికి హాని ఉండదు. నీటిలో త్వరగా కరిగిపోతాయి. ధర కాస్త ఎక్కువయినా ఎంతో బాగుంటున్నాయి.



విగ్రహాల రవాణా ఉచితం
సాయి కిరణ్, స్తంభాద్రి ఉత్సవ సమితి కార్యదర్శి

నా సొంత ఖర్చులతో మట్టి విగ్రహాలకు ఉచిత ట్రాన్స్‌పోర్టు కల్పించాను. మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు మండప ఖర్చుల్ని తగ్గించి ఉచితంగా ట్రాన్స్‌పోర్టు చేస్తున్నారు.



ఈ సారి ఎక్కువే..
వినోద్ , స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు

గత ఏడాది కన్నా ఈ సారి ఎక్కువ మంది మట్టి వినాయకుల్ని ఏర్పాటు చేస్తున్నారు. ముందుగానే విస్తృతంగా ప్రచారం చేయడం ఫలించింది. విగ్రహాల ఉచిత పంపిణీకి కూడా ఏర్పాట్లు చేశాం.

నేడు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో.. మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

ఖమ్మం గాంధీచౌక్: గణపతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, రోటరీక్లబ్ ఆఫ్ స్తంభాద్రి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఉచిత మట్టివినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్రతీ ఏడాది 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది సైతం అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రకృతిని ప్రేమించండి.. మట్టి గణపతిని పూజించండి..

- భద్రాద్రి కొత్తగూడెం జేసీ రాంకిషన్



విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులను పరిశీలిస్తున్న జేసీ రాంకిషన్

పాల్వంచ టౌన్: 'ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించండి.. మట్టి గణపతిని పూజించండి' అని భద్రాద్రి కొత్తగూడెం జాయింట్‌కలెక్టర్ రాంకిషన్ పిలుపునిచ్చారు. బుధవారం పాల్వంచలోని ఆశ్రమ పాఠశాలలో.. పాల్వంచ, కొత్తగూడెం, ములకలపల్లి, బూర్గంపాడు మండలాల్లోని విద్యార్థులకు నేషనల్ గ్రీన్‌కోర్, జిల్లా సైన్స్ విభాగం, ఆశ్రమ పాఠశాల సంయుక్తంగా మట్టి గణపతి విగ్రహాల తయారీపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూ... వినాయక చవితి ప్రకృతి పండుగగా ఉండాలని, ప్రకృతికి హాని కలిగించే విధంగా ఉండొద్దని అన్నారు. విగ్రహాలను రసాయనాలతో తయారు చేయడం వల్ల జల, వాయు కాలుష్యం ఏర్పడి, జీవకోటి ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఏటీడీవో లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ ప్రకృతికి ఆటంకం కలుగ చేస్తే దాని ప్రభావం జీవకోటిపై ఉంటుందన్నారు. మానవుని వికృతి చేష్టలు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సైన్స్ అధికారి ఎస్. చలపతిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ నూరుశాతం లక్ష్యాన్ని అధిగమించిందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గ్రీన్‌కోర్ కమిటీలు ఏర్పాటు చేశారని, నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ సీహెచ్. బుచ్చిరాములు, జిల్లా ఎన్‌సీఎస్‌సీ కో-ఆర్డినేటర్ సంపత్ కుమార్, ఎంఈవో సరస్వతి, కమిటీ నిర్వాహకులు పి. శివరామకృష్ణ, వి. పద్మాకర్, పి. సాయికృష్ణ, వై. ప్రకాశ్‌కుమార్, ప్రభావతి, కే. విజయలక్ష్మి, మాధవి, పార్థసారధి, వీరన్న, రాజేందర్, వర్తక సంఘం అధ్యక్షులు చలవాది ప్రకాశ్, వాసవిక్లబ్ అధ్యక్షులు ప్రసాద్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు.. పటిష్ట బందోబస్తు

- 'ఆంధ్రజ్యోతి'తో ఏసీపీ గణేష్



ఏసీపీ గణేష్

ఖమ్మం క్రైం: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఖమ్మం నగరంలో పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు ఏసీపీ గణేష్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: గణేష్ ఉత్సవాలకు ఎటువంటి ఏర్పాట్లు చేపట్టారు..?

ఏసీపీ: నగరంలో 800 విగ్రహాలు ఏర్పాటు చేస్తారని అంచనా వేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఉత్సవ సమితి నిర్వాహకులతో సమావేశాలు, తదితర ముందస్తు చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: భద్రతా పరంగా చేపట్టిన చర్యలు ఏంటి..?

ఏసీపీ: అనుమతి పొందాకే మండపం ఏర్పాటు చేయాల ని చెప్పాం. ప్రతీ మండపం వద్ద నిఘా, ప్రతీ వీధికి ఒక కానిస్టేబుల్‌ను నియమించాం. వేదికల వద్ద అశ్లీల నృత్యాలు, తదితర అసాంఘిక చర్యల నియంత్రణ, వేదికల వద్ద మైక్‌ను నిర్ణీత సమయం వరకే అనుమతించేలా చూడాలని నిర్ణయించాం. కరెంటు వైర్లు నాణ్యత గలవి వాడకం ద్వారా అగ్నిప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: ఊరేగింపు రోజున ఎలాంటి ఆంక్షలు విధిస్తారు..?

ఏసీపీ: విగ్రహాల నిమజ్జన ఊరేగింపుల కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ రూపొందించాం. ఆ రోజున కొన్ని రోడ్లలో వన్ వే అమలవుతుంది కనుక అనుమతించిన రోడ్‌లలోనే శోభాయాత్ర జరపాలి.

ఆంధ్రజ్యోతి: ఎక్కడెక్కడ నిమజ్జన అనుమతి ఉంది..?

ఏసీపీ: మున్నేరులో బొక్కలగడ్డ వద్ద, ప్రకాష్ నగర్‌లో మరో చోట వినాయక నిమజ్జనాలకు అనుమతించాం. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా లకారం చెరువులో నిమజ్జనం నిషేధించాం.

ఆంధ్రజ్యోతి: నిమజ్జన ప్రాంతాల్లో రక్షణ చర్యల గురించి..?

ఏసీపీ: ఘాట్ల వద్ద ఈతగాళ్లు, వైద్య బృందాలు, లైటింగ్ ఏర్పాట్లు, నీటి వసతి కల్పించనున్నాం. డయల్ 100తో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తాం.



మట్టితో సిద్ధి గణపతిని తయారు చేస్తున్న దండిబొట్ల రామాంజన కుమార శర్మ

ఆరేళ్లుగా మట్టి గణపతికి పూజలు..

కొత్తగూడెం సాంస్కృతికం: కొత్తగూడెంలోని శ్రీనగర్ కాలనీ శ్రీ చం డీ సర్వఘ్న పీఠంలో పురోహితుడిగా ఉన్న దండిబొట్ల రామాంజన కుమారశర్మ ఆరేళ్లుగా మట్టి గణపతిని తయారుచేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ ఏడాది నవరాత్రులను పురస్కరించుకుని చండీ సర్వఘ్న పీఠంలో నాలుగు అడుగుల ఎత్తయిన సిద్ధి గణపతిని మట్టితో తయారు చేశారు. రామాంజన కృషిని పలువురు అభినందించారు.



గణేష్ నవరాత్రి ఉత్సవాలపై పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా

చవితి ఉత్సవాల్లో.. అప్రమత్తంగా ఉండండి

- మండపాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయండి
- పోలీస్ అధికారుల సమావేశంలో ఎస్పీ కిషోర్ ఝా

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: గణేష్ నవరాత్రుల బందోబస్తు విషయంలో పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలో జిల్లా పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. నవరాత్రుల్లో రోజుకు రెండుసార్లు అయినా ఎస్‌హెచ్‌వోలు తప్పని సరిగా మండపాలను సందర్శించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా బైండోవర్ చేయాలని సూచించారు. దొంగతనాలకు ఆస్కారం ఉంటుందని, గస్తీ పెంచాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీకెమెరాలను ఏర్పాటు చేసి, పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. బక్రీద్ పండుగ కూడా ఇదే సమయంలో వస్తోందని, ఎటువంటి మతపరమైన సంఘటనలకూ తావివ్వకుండా ముందుగానే ఆయా ఏరియాల్లోని అన్ని రకాల మతపెద్దలను పిలిపించి మాట్లాడాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకునేలా చూడాలన్నారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, కార్యక్రమాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ సునీఈల్‌దత్, కొత్తగూడెం, మణుగూరు డీఎస్పీలు సురేందర్‌రావు, అశోక్‌కుమార్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, అడ్మిన్ ఆర్‌ఐ కృష్ణ, ఆపరేషన్స్ ఆర్‌ఐ ప్రసాద్, ఎంపీవో సోములు పాల్గొన్నారు.

జిల్లాలో వందశాతం ఆల్‌బెండాజోల్ పంపిణీ

జూలూరుపాడు: పిల్లల్లో నులిపురుగులు వ్యాపించకుండా నివారించేందుకుగాను వైద్యశాఖ ఆధ్వర్యంలో వందశాతం మంది చిన్నారులకు ఆల్‌బెండాజోల్ మందు బిల్లలను పంపిణీచేసినట్లు ఆర్‌బీఎస్‌కె జిల్లా కో-ఆర్డినేటర్ పోటు వినోద్ తెలిపారు. బుధవారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల10వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 19 సంవత్సరాల వయస్సు గల 95 శాతం మంది చిన్నారులకు మందు బిళ్లలను అందించామని, మిగిలిన వారికి బుధవారం పంపిణీ చేశామని వివరించారు.

ఇసుక ర్యాంపులు తెరిపించండి

తహసీల్దార్‌కు ట్రాక్టర్ డ్రైవర్ల వినతి



తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న డ్రైవర్లు

లక్ష్మీదేవిపల్లి: మండలంలోని కారుకొండ, చాతకొండలోని ఇసుక ర్యాంపులను తెరిపించి ట్రాక్టర్ నిర్వాహకులను, డ్రైవర్లకు ఉపాధిభృతి కల్పించాలని కోరుతూ బుధవారం లక్ష్మీదేవిపల్లి మండల తహసీల్దార్ సునిల్‌రెడ్డికి విన్నవించుకున్నారు. గత 15రోజుల నుంచి ఇసుక ర్యాంపులు తెరుచుకోకపోవడంతో ట్రాక్టర్ నిర్వాహకులు, వాటిపై ఆధారపడ్డ వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని గోడు వెల్లబుచ్చుకున్నారు. ఇసుక రవాణా చేసేందుకు బ్యాంకులో డీడీలు తీసి కూపన్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జీవనోపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా కొందరు బడా బాబుల సహకారంతో అక్రమంగా ఇసుకను రవాణా చేసుకుంటూ కాసులు గడిస్తున్నారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతోపాటుగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ పథకం ద్వారా మండలాల్లోని అన్ని పంచాయతీల్లో నిర్మించుకుంటున్న మరుగుదొడ్లకు ఇసుక అత్యంత అవసరంగా ఉందని, లబ్ధిదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అధికారులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకోవాలని విన్నవించారు. ఈ విషయమై తహసీల్దార్ స్పందించి ర్యాంపులు నడుస్తే కూపన్లు జారీచేస్తామని స్పష్టం చేశారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

జూలూరుపాడు: జిల్లాలోని వివిధ గ్రామాలలో ప్రజలు గత కొన్ని రోజులుగా జ్వరాల బారిన పడి మంచం పట్టినా వారికి వైద్యసేవలను అందించడంలో వైద్యశాఖ నిర్లక్ష్యం వహిస్తోందని దని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా విమర్శించారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులను దృష్ట్యా కలెక్టర్, పాలన యంత్రాంగం తక్షణమే జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో సాబీర్‌పాషా మాట్లాడారు. గత ఏడాది జిల్లాలోని భద్రాచలం, పాల్వంచ, చర్ల, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు తదితర ప్రాంతాల్లో ప్రజలకు డెంగ్యూ జ్వరాలు సోకినప్పటికి సకాలం లో వైద్య సేవలు అందక పోవడంతో అనేక మంది మృత్యువాత పడిన సంఘటనలు ఛోటు చేసుకున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది డెంగ్యూ లక్షణాలతో బాధపడుతున్నప్పటికీ వైద్యసేవలను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రిల్లో పూర్తిస్థాయిలో మందులు, సిబ్బంది, ల్యాబరేటరీ కొరతగా ఉండడంతో ఉన్న రోగులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాలకు సాగు నీరు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతా స్వరాజ్ రావు, నాయకులు షేక్ చాంద్‌పాషా, ఎస్‌కె. నాగూల్‌మీరా, దేవినేని జనార్దన్ పాల్గొన్నారు.

సినిమాలు

కొత్తగూడెం

- దుర్గా: ఫిదా
- పూర్ణ: జయ జానకీ నాయక
- పరమేశ్వరి: లై
- విశ్వరూప: ఆనందోబ్రహ్మ
- మహేశ్వరి: నేనే రాజు.. నేనే మంత్రి

పాల్వంచ

- వెంకటేశ్వర జయ జానకీ నాయక
- వేణుగోపాల్ నేనే రాజు.. నేనే మంత్రి
- శాంతి లై

ప్రధాన ఆసుపత్రి

సూపరింటెండెంట్
డాక్టర్ జనార్దన్ 8008553195
గురువారం డ్యూటీ డాక్టర్
సరళ

గ్యాస్ సమాచారం

కొత్తగూడెం ఇండియన్ గ్యాస్ గోడౌన్ నుంచి 23న గ్యాస్ బుక్ చేసుకున్న వారికి 30న సిలిండర్ అందజేస్తారు.
గ్యాస్ ఆన్‌లైన్ బుకింగ్
9848824365

రైతు బజార్ ధరలు

కిలోకి (రూ.ల్లో)			
టమోట	50	క్యాబేజీ	35
పచ్చిమిర్చి	30	ఉల్లిగడ్డలు (రైతుబజారు)	35
వంకాయ	40	గోరుచిక్కుళ్లు	30
బెండకాయ	30	చామగడ్డ	50
కాకరకాయ	30	అలుగడ్డ	20
బోడకాకర	120	క్యారెట్	70
బీరకాయ	25	తెల్లవంకాయ	40
దొండకాయ	20	తోటకూర	3
చిక్కుళ్లు	40	కొత్తిమీర	20
దోసకాయ	15	చుక్కకూర	3
సొరకాయ	15	బచ్చలకూర	3

పోలీస్ సమాచారం

- డీఎస్పీ 9440795310
- వన్‌టౌన్ సీఐ 9440795314
- టు టౌన్ సీఐ 9440904304
- త్రీ టౌన్ సీఐ 9440904305
- ఓఎస్‌డీ 9440795302

ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె

కొత్తగూడెం టౌన్: న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ మండల స్థాయి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి అకౌంటెంట్స్, ఆపరేటర్లు జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మండల స్థాయి ఎకౌంటెంట్ అధ్యక్షురాలు కే. హేమలత మాట్లాడారు. మండల స్థాయిలో గత 12 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తు దుర్భర జీవితాన్ని గడుపుతున్నామన్నారు. తమసేవలను గుర్తించి గతంలో అప్పటి ప్రభుత్వం 2013లో సీబీవోహెచ్‌ఆర్‌ని వర్తింపచేయాలని సూచిస్తూ సర్క్యులర్ జారీచేసినప్పటికీ ఇంతవరకు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రధాన సమస్యలైన సెర్ప్ హెచ్‌ఆర్‌సీ పాలసీని అమలు పర్చాలని, కనీస వేతనం రూ. 18,500 ప్రతీనెల సెర్ప్‌నుంచి అందచేయాలని, ఆరోగ్య భద్రత, బీమా సౌకర్యం, హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పాల్వంచ టౌన్: పాల్వంచ పట్టణ పరిధిలోని గాంధీనగర్ ఐదో వార్డులో ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో శ్రావణ మాసంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు బుధవారం జరిగిన అన్నదాన కార్యక్రమంతో ముగిశాయి. గాంధీనగర్‌లో 1951వ సంవత్సరం నుంచి ప్రతీ సంవత్సరం ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గతనెల 24వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు బుధవా రంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పూజారి భాస్కర్‌దాస్, ఆలయ ధర్మకర్త గంగపురి నాగేశ్వరరావు, కొత్తపల్లి సోమయ్య, దాట్ల బాలయ్య, కేసుపాక వెంకటేశ్వర్లు, ఎర్రమల్లయ్య, దొమ్మటి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

డిటెన్షన్ విధానాన్ని అమలుచేస్తే ఉద్యమిస్తాం

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంటి



సమావేశంలో మాట్లాడుతున్న చంటి

జూలూరుపాడు: నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం 6వ, 7వ తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని చూస్తుందని, దీనికి వ్యతిరేకంగా విద్యార్థులను ఐక్యం చేసి ఉద్యమిస్తామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జేడీ చంటి తెలిపారు. బుధవారం జూలూ రుపాడులో ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యారంగం నిర్వీర్యం అయి బడుగు వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆరోపించారు. ఆయా తరగతుల విద్యార్థులు డిటెన్షన్ అయితే మళ్లీ అదే తరగతిలో చదవాల్సి రావడంతో మనోవేదనకు గురయ్యే అవకాశాలున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం డిటెన్షన్ విధానంపై పునరాలోచన చేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్ల ఉపకారవేతనాల, ఫీజు రియాంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గజ్జల సందీప్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ చాంద్‌పాషా, నాయకులు సమీర్, సురేష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపుడి సర్పంచ్ శ్రీనివాసరావు మృతి

● పలువురు రాజకీయ నాయకులు, అధికారులు నివాళులు ● దుకాణాలు, వ్యాపార సంస్థల బంద్



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేత బ్రహ్మయ్య



సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి సర్పంచ్ పొనుగుపాటి శ్రీనివాసరావు (45) ఆకస్మికంగా మృతిచెందాడు. బుధవారం గుండెపుడి గ్రామాన్ని టీడీపీ, టీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులతో పాటు, పలువురు అధికారులు సందర్శించి సర్పంచ్‌కు నివాళులు అర్పించారు. టీడీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తుళ్లూరి బ్రహ్మయ్య, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీడీపీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జీ మాలోత్ రాందాస్ నాయక్, టిరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండె వీరహనుమంతురావు, టీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్ తదితరులు శ్రీను మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్ళు అర్పిం చారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియ జేశారు. ఎంపీపీ మూడు చిట్టిబాబు, జడ్పీటీసీ శెట్టిపల్లి వెంకటేశ్వ రరావు, ఎంపీడీవో బి.భారతిలతో పాటు, టీఆర్‌ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, లేళ్ల వెంకటరెడ్డి, కొమ్మినేని పాండురంగారావు, చంద్ర నరేంద్రకుమార్‌లు తదితరులు సంతాపాన్ని తెలియజేశారు. సర్పంచ్ మృతికి సంతాపసూచకంగా వ్యాపారులు బంద్ పాటించారు.

'తెల్లబెల్లం విక్రయాలకు అనుమతి ఇవ్వాలి'

కొత్తగూడెం టౌన్: దేశవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిపే వినాయక చవితి పండుగకు అవసరమైన తెల్లబెల్లాన్ని విక్రయించేందుకు ఎక్సైజ్‌అధికారులు వ్యాపారస్తులకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కురుమసంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కురుమసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబపూర్ణచందర్ రావు మాట్లాడుతూ వినాయక చవితి పండుగకు దేవుడి నైవేద్యాలకు తెల్లబెల్లం అత్యంత అవసరంగా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పండుగ సాంప్రదాయాన్ని కాపాడుకునేందుకు అన్ని రాష్ట్రాల్లో, జిల్లాల్లో తెల్లబెల్లం అమ్మకం జరుగుతుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధికారులు వ్యాపారులను అడ్డుకోవడాన్ని ఆయన ఖండించారు. ప్రజల మనోభావాలను అధికారులు గుర్తించి తెల్లబెల్లం విక్రయాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి కొత్తగూడెం

5

గురువారం 24 ఆగస్టు 2017

కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు

30 శాతం కార్మికులకు చెల్లించాలి: ఏఐటీయూసీ

మణుగూరు: సింగరేణి సంస్థకు ఈ ఏడాది వచ్చిన లాభాల్లో కార్మికులకు 30 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని కోరుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా అధికారులకు వినతిపత్రాలు సమ ర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సభ్యుడు నామా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది సుమారు రూ. 15వందల కోట్ల మేరకు సంస్థకు లాభాలు వచ్చాయని, అందులోనుంచి 30 శాతం కార్మికులకు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయ కులు రాంగోపాల్, శ్రీనివాస్, అంజయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



జూలూరుపాడులో గణేష్ విగ్రహాన్ని కొనుగోలు చేస్తున్న యువకులు

జూలూరుపాడు: వినాయక చవితిని పురస్కరించుకొని గ్రామాల్లో గణేష్ ఉత్సవాలను నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని జూలూరుపాడు, పాపకొల్లు, వెంగన్నపాలెం, గుండెపుడి, పిఎన్‌పురం, కాకర్ల తదితర గ్రామాలలో గణనాధులను ప్రతిష్టించేందుకు కమిటీ సభ్యులు మండపాలను సిద్ధం చేశారు. ఈనెల 25న వినాయక చవితి పండుగ కావడంతో వేగంగా ఏర్పాట్లుచేస్తున్నారు. వివిధ ఆకృతుల్లో తయారుచేసి గణ నాథుని విగ్రహాలను అమ్మేందుకు వ్యాపారులు జూలూరుపాడులో సిద్ధంగా ఉంచారు. దీంతో వివిధ గ్రామాలల్లో ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను కొనుగోలుచేస్తున్నారు. గత ఏడాదితో పొల్చుకుంటే ఈ ఏడాది విగ్రహాల ధరలు పెరగడాన్ని చూసి కమిటీ సభ్యులు అవాక్కైపోతున్నారు.



గణనాథున్ని ప్రతిష్టించేందుకు మండపం

పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరగాలి

● ఏటీడీవో లక్ష్మణ్‌బాబు

పాల్వంచ టౌన్: పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహన కలిగించా లని మట్టివిగ్రహాల తయారీ వల్ల విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడుతుందని ఐటీడీఏ ఏటీడీవో ఎం.లక్ష్మణ్‌బాబు అన్నారు. పాల్వంచ ఆశ్ర మ పాఠశాలలో జరిగిన బంకమట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీల బహుమ తి ప్రధానోత్సవానికి లక్ష్మణ్‌బాబు ముఖ్య అతిధిగా విచ్చేశారు. ప్రకృతి ద్వార లభించే ప్రతీ మొక్కలో ఔషదగుణాలు ఉంటాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్. చలపతిరాజు నేషనల్ గ్రీన్‌కోర్, హరిత హారం, ఇన్‌స్పైర్, ఎన్‌సీఎస్ అటల్ టింకరింగ్ కార్యక్రమాల గురించి వివరించారు. మట్టివిగ్రహాల తయారీ పోటీలో విజేతలైన విద్యార్థులకు ఏటీడీవో లక్ష్మణ్‌బాబు, డీఎస్‌వో చలపతిరాజు అందజేశారు.



విద్యార్థులు తయారుచేసిన మట్టి గణపతులను పరిశీలిస్తున్న జేసీ

ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

పాల్వంచ టౌన్: మానస అకాడమి ఆధ్వర్యంలో గురు,శుక్రవారాల్లో ఉచిత మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు మానస అకాడమి డైరెక్టర్ టి.ప్రభు కుమార్ అన్నారు. ఈ విగ్రహాల పంపిణీ రామాలయ భజనమందిర స్థలంలో అందించనున్నట్లు బుధవారం తెలిపారు. మట్టి విగ్రహాలతో పూజచేస్తే, పూజ ఫలితాలు లభిస్తాయని, మీరు చేసిన మట్టి విగ్రహాలు నిమజ్జనంలో వెంటనే నీటిలో కరిగి ఫలితం లభిస్తుందన్నారు. నీటిలో మంచి చేసేజల జీవరాశులు నీటిని శుద్ధిచేసి మంచినీరు అంది స్తుందని తెలిపారు.

కెరీర్‌పై అవగాహన సదస్సు

లక్ష్మిదేవిపల్లి: లక్ష్మిదేవిపల్లిలోని సాహితి కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో బుధవారం ఖమ్మంలోని యువసంస్థ ఆధ్వర్యంలో కెరీర్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంస్థ డైరెక్టర్ నందు మాట్లాడుతూ డిగ్రీ తర్వాత విద్యార్థులు ఏఏ కోర్సులు ఎంచుకోవాలి, పోటీ పరీక్షలను ఇంటర్వ్యూలను ఎలాఎదుర్కోవాలో విద్యార్థులకు వివరించారు. సదస్సులో విద్యార్థినీ, విద్యార్థులుఎంతో ఉత్సాహంగా పాల్గొని వారి సందేహాలను నివృత్తిచేశారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెరిగి, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.



సదస్సులో మాట్లాడుతున్న యువసంస్థ డైరెక్టర్ నందు

పాల్వంచలో భారీ వర్షం..

● జలమయమైన కాలనీలు, లోతట్టు ప్రాంతాలు

● వాననీటితో ప్రజల అవస్థలు



వర్షానికి రోడ్డుపక్కన వరదనీరు



రోడ్డుపక్కన విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

పాల్వంచ టౌన్: పాల్వంచ పట్టణ పరిధిలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. సుమారు గంటపాటు సాయంత్రం సమయంలో వర్షంపడటంతో వీధులు జలమయమయ్యాయి. పాఠశాల నుంచి కార్యాలయం నుంచి వచ్చే వారితోపాటు పలు పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాం తాల్లోని పలు ప్రాంతాల్లోని వీధులు జలమయమయ్యాయి.

ట్రాఫిక్‌కు అంతరాయం..

బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నవభారత్ సెంటరు సమీపంలో చెట్టుపడిపోయి సుమారు గంటపాటు ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ ప్రాంతం నుంచి రోడ్డుకి ఇరువైపులా భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. నవభారత్ అధికారులు వెంటనే స్పందించి పడిన చెట్టుకొమ్మలను తొలగించారు.

అనంతరం నవభారత్ సెక్యూరిటి వారు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను పంపించారు.

26న కొత్తగూడెంలో టీమాస్ ఫోరం జిల్లా సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఫోరం నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు

కొత్తగూడెం టౌన్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్‌లో ఈనెల 26వ తేదీన నిర్వహించే టీమాస్ ఫోరం జిల్లా సదస్సును అన్నివర్గాల ప్రజలు, మేధావులు, రాజకీయ వేత్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీమాస్ ఫోరంజిల్లా నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం కొత్తగూడెంలోని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ సామాజిక ప్రజాసంఘాలన్నింటిని ఐక్యవేధికగా చేసి ప్రజల ముందు ఉంచుతున్నామని, హక్కుల సాధనకు సమస్యల పరిష్కారానికి ప్రజలతో ఐక్యపోరాటాలకు ముందుకు సాగేందుకు పిలుపునిస్తున్నామన్నారు. జరిగే సదస్సుకు రాష్ట్ర స్టీరింగ్‌కమిటీ సభ్యులు గద్దర్, విమలక్క, జేబీ. రాజు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, అద్దంకి దయాకర్, పాపయ్య మాదిగ, బెల్యానాయక్, టీమాస్ రాష్ట్ర స్టీరింగ్‌కమిటీ కన్వీనర్ జాన్‌వెస్లీ, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్య దర్శి అన్నవరపు సత్యనారాయణ, టీఎంఆర్‌పీఎస్ నాయకులు గొడ్ల మోహన్‌రావు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి తాటిపర్తి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం టీమాస్ ఫోరం ఏర్పాటు

పాల్వంచ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో 92శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభివృద్ధికోసం టీమాస్ ఫోరం ఏర్పడిందని జిల్లా సమన్వయకర్త మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనమాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీలకు అన్యాయం జరుగు తుందన్నారు. సామాజిక న్యాయం ఎక్కడఅమలు లేదని ఆరోపించారు. ఈనెల 26న జరిగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టీమాస్ ఫోరం జిల్లా సదస్సు కొత్తగూడెం క్లబ్‌లో జరుగుతుందన్నారు.

‘మహిళల ఆర్థికాభివృద్ధికే వృత్తి శిక్షణ’

మణుగూరు రూరల్: సింగరేణి పరిసర ప్రాంతాల మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే సింగరేణి సేవా సంస్థ ద్వారా మహిళలకు వృత్తి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నా మని ఏరియా అధికార ప్రతినిధి రేవు సీ తారాం అన్నారు. సింగరేణి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను బుధవారం ఆయన ప్రారంభించి.. మాట్లాడారు. ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు ఉమా రాణి, వెల్ఫేర్ ఆఫీసర్ సింగ్ శ్రీనివాస్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ పాల్గొన్నారు.



తరగతులను ప్రారంభిస్తున్న దృశ్యం

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

ఇల్లెందురూరల్: సింగరేణి భూగర్భ గని ప్రమాదంలో మృతిచెందిన తొడితెలగూడేనికి చెందిన మెరుగు కోటేశ్వర్‌రావు జ్ఞాపకార్థంగా బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు మెరుగు పద్మ, రవీంద్ర, రాజ్యలక్ష్మీ, భాస్కర్, రజిత, ఉమాశంకర్, సుజాత, శేషమ్మ, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

ఇల్లెందు సినిమాలు

కళాంజలి	-	లై
లలిత్ కళామందిర్	-	జయ జానకి నాయక
శ్రీ సీతారామ	-	నేనే రాజు నేనే మంత్రి

రోగులకు సౌకర్యాలు కల్పించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని

ఇల్లెందుటౌన్: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో సీపీఎం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రావడంతో గ్రామాల్లో దోమ కాటుతో ప్రజలు రోగాలబారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం అందకపోవడంతో గిరిజనులు అప్పుచేసి ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గ కేంద్రాల్లో 100 పడకల ఆసుపత్రిని కడతామని చెప్పి మాట మార్చారని ఎద్దేవచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే. రమేష్, ఎన్.



మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

సారయ్య, జిల్లా నాయకులు దేవులపల్లి యాకయ్య, మండల కార్యదర్శి ఆలేటికిరణ్, జైబున్నిసా, ఎం. శ్రీనివాస్, సర్వయ్య, వజ్జసురేష్, పీ. వెంకన్న, డీ. పద్మ, రాందాస్, ఎన్. శ్రీను, కే. ముత్యాలు, శంకర్ పాల్గొన్నారు.

ఇంకెప్పుడు నిర్మిస్తారో?

- శిథిలావస్థలో డ్రైయినేజీలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- రోడ్లపైనే పారుతున్న మురుగు
- పట్టించుకోని అధికారులు





ఇల్లెందు పట్టణంలో శిథిలావస్థలో ఉన్న డ్రైయినేజీలు

ఇల్లెందుటౌన్: ఇల్లెందు పట్టణంలోని పలు వార్డుల్లో డ్రైయినేజీలు శిథిలావస్థకు చేరాయి. దీంతో మురుగంతా పేరుకుపోయి తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుంది. అనేక వార్డుల్లో డ్రైయినేజీలు కూలిపోయి ఉన్నాయి. దీంతో మురుగు నీరంతా బయటకు వెళ్లకుండా నిలిచిపోతుంది. దీంతో వ్యర్థం పేరుకుపోయి వాసన వస్తోంది.

రోగాల బారిన ప్రజలు

మునిసిపాలిటీ పారిశుధ్య విభాగం కార్మికులు ఎప్పటికప్పుడు డ్రైయినేజీలను శుభ్రపరుస్తున్నప్పటికీ... సక్రమంగా లేకపోవడంతో నీరు నిలిచిపోయి, దోమల, ఈగల తీవ్రత పెరిగిపోతుంది. దీనితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వెనుకబడిన స్లమ్ ఏరియాల్లో సైతం డ్రైయినేజీలు శిథిలావస్థలో ఉన్నాయి. పాలకులు రూ. లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నప్పటికీ... సంవత్సరాలుగా అధ్వానంగా ఉన్న డ్రైయినేజీలను నిర్మించలేకపోతున్నారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

దుర్గంధంతో నానా అవస్థలు పడుతున్నామని, రోగాలు వ్యాపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఎన్నిసార్లు తమ గోడును చెప్పినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డ్రైయినేజీల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా వదిలేశారు..

పట్టణంలోని 21వ వార్డు ఎల్‌బీఎస్‌నగర్‌లో నిర్మించిన డ్రైయినేజీ నిర్మాణం పూర్తికాకుండానే అసంపూర్తిగా వదిలివేయడంతో మురుగునీరంతా నిలిచిపోయి దోమల తీవ్రత పెరిగిపోతుంది. నిత్యం మురుగునీరు నిలిచివుండటంతో ఇంటి ప్రహరీ గోడలు సైతం కూలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ప్రణాళికలు రూపొందిస్తున్నాం'

ఈ విషయంపై మునిసిపాలిటీ కమిషనర్ ఎం. రవిబాబు మాట్లాడుతూ.. 14వ ఫైనాన్స్ నిధుల ద్వారా డ్రైయినేజీల నిర్మాణం చేపడతామని, దానికోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు

ఇల్లెందురూరల్: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే గ్రామసభల ద్వారా భూ సమస్యలను పరిష్కారించామన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులను గుర్తించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని వివరించారు. గతంలో సాదాబైనామాలో దరఖాస్తు చేసుకున్న రైతులకు పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మునిసిపల్ కార్మికుల టోకెన్ సమ్మె

నోటీసు అందజేసిన జేఏసీ నాయకులు

ఇల్లెందుటౌన్: రాష్ట్రంలో మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజులపాటు టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. బుధవారం ఇల్లెందు మునిసిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్యకు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు దేవరకొండ శంకర్, తాళ్లూరి కృష్ణ, ఎస్‌కే. యాకూబ్‌షావలీ మాట్లాడుతూ మునిసిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ ఆరోగ్యాలు పాడుచేసుకొని ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం జీతాలు పెంచకుండా నిర్లక్షంగా వ్యవహరిస్తుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు



నోటీసు అందజేస్తున్న దృశ్యం

సింగరేణిలో కనీస వేతనాలు అమలుచేసేందుకు మొదటిసారిగా జీవో జారీ అయిందని తెలిపారు. అదేవిధంగా మునిసిపల్‌కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సారంగపాణి, బందం నాగయ్య, చుక్క రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా.. ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఎంపిక

ఇల్లెందురూరల్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారుల ఎంపికను గ్రామసభల ద్వారా చేపడతామని ఎంపీడీవో కనకదుర్గ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన లబ్ధిదారులను గ్రామసభలు నిర్వహించి ఎంపిక చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో బ్యాంక్ అధికారులతో కలిసి గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుదారులు సహకరించాలని కోరారు.

ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలి

- ఎంపీపీ సరస్వతి, జడ్పీటీసీ సభ్యురాలు చంద్ర అరుణ

ఇల్లెందురూరల్: ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని మండల పరిషత్ అధ్యక్షురాలు మూడ్‌సరస్వతి, జెడ్పీటీసీ చంద్ర అరుణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మండలంలో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్డిలేని కుటుంబాలు గుర్తించి మరుగుదొడ్డి నిర్మించుకునే విధంగా ప్రజాప్రతినిధులు చైతన్యవంతం చేయాలని కోరారు. మరుగుదొడ్డి నిర్మించుకున్న కుటుంబాలకు సత్వరమే బిల్లులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ నెల కల్లా మరుగుదొడ్ల లక్ష్యాన్ని పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కనకదుర్గ, సర్పంచ్‌లు మోకాళ్ళ కృష్ణ, వాంకుడోత్ సరోజిని, ఎంపీటీసీలు రాంబాబు, పొట్టయ్య, పంచాయతీ కార్యదర్శులు షర్మిల, రజినికాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రొజెక్టర్ అందజేత

ఇల్లెందురూరల్: మండల పరిధిలోని రొంపేడ్ పంచాయతీ 21ఫిట్ హైస్కూల్‌కు స్థానికులు రూ. 75వేల కంప్యూటర్, ప్రొజెక్టర్‌లను అందించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దాతలు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు తమ వంతు సహాయం అందిస్తున్నట్లు దాతలు వివరించారు. ఈ కార్యక్రమంలో దాతలు ఎంపీటీసీ సభ్యుడు పూనెం సురేందర్, మంచాల వెంకటేశ్వర్లు, నాగరాజు, హరికృష్ణ, శ్రీనివాస్, మనోహర్, ఖాసీం, శ్రీను, రమేష్, పద్మ, సరోజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉమామహేశ్వర్‌రావు, అరుంధతి, రాములు, లస్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రొజెక్టర్ వద్ద దాతలు, ఉపాధ్యాయులు

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

- టేకులపల్లిలో కార్మికుల ర్యాలీ

టేకులపల్లి: హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హమాలీ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) ఆధ్వర్యంలో బుధవారం టేకులపల్లిలో హమాలీ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు చేయాలని వినతి పత్రాన్ని తహసీల్దార్ అంజంరాజుకు అందచేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా నాయకులు మల్లికార్జునరావు, రాంసింగ్, ఎన్డీ మండల కార్యదర్శి బానోతు ఊక్లా, మంచా, హర్జా, శంకర్, దళ్‌సింగ్, రమేష్, చరణ్, చిన్నా, నాగులు, బాబు, భద్రు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సొంత ఖర్చులతో ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటు



లైట్లను అందజేస్తున్న కౌన్సిలర్ స్వర్ణలత

ఇల్లెందుటౌన్: ఇల్లెందు పట్టణంలోని 9వ వార్డు కౌన్సిలర్ పర్రె స్వర్ణలత రూ. 15వేల వ్యయంతో సొంతంగా వార్డులోని వివిధ ప్రాంతాల్లో ఎల్‌ఈడీ లైట్లను అమర్చారు. 9వ వార్డులో వీధిలైట్లు లేకపోవడంతో ప్రజలు చీకటిలో ఇబ్బందులుపడుతున్నారని లైట్లను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పర్రె స్వర్ణలత మాట్లాడుతూ అధికారులు పట్టించుకోకపోవడంతో తనే సొంత డబ్బులతో ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్రె శ్రీనివాస్, ప్రేమ్, సంజీవ్, మంజుల, సుప్రితి, అవేద, హబీబున్నిసా తదితరులు పాల్గొన్నారు.

'ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి'

ఇల్లెందురూరల్: ఐటీడీఏ ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్‌రూల్స్ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఐటీడీఏల ముట్టడిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కుర్సం అంజయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్‌రూల్స్ ద్వారా చేపట్టబోయే పదోన్నతులు జీవో ఎంఎస్-3 ప్రకారమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చాపల రమేష్‌బాబు, మోకాళ్ల మోహన్‌రావు, కృష్ణార్జున్‌రావు, ఈసాల రాంబాబు, కల్తీ భాస్కర్, అంజయ్య పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఏకం కావాలి: కేవీపీఎస్

ఇల్లెందుటౌన్: హక్కుల సాధన, సమగ్రాభివృద్ధి కోసం దళితులంతా ఏకం కావాలని కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి మన్నెం మోహన్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని నెహ్రూనగర్ దళిత వాడలో కేవీపీఎస్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరియమ్మ, సువార్త, మమత, రమా, ఆదిలక్ష్మి, అనసూర్య, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.